ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
ఆదివారం 9 ఫిబ్రవరి 2025





జంక్ ఫుడ్‌తో.. జర భద్రం

- చిన్నారులు, యువత ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- అరికట్టకపోతే రక్తహీనత, ఊబకాయం
- మద్యపానం, ధూమపానంలానే ప్రమాదం అంటున్న వైద్యులు
- ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలను పట్టించుకోని అధికారులు
- పిల్లల ఆరోగ్యంపై హెచ్చరిస్తున్న వైద్యులు



ప్రస్తుతం చిన్నారులు, యువత జీవితాల్ని చిరుతిళ్లు శాసిస్తున్నాయి... బయటకు వచ్చిన తరువాత అడుగడుగున చిరుతిండి దుకాణాలు, హోటళ్ల ద్వారా జంక్‌ఫుడ్ దొరుకుతుంది.. అది వారికి బలమివ్వకపోగా ప్రమాదంలోకి నెడుతుంది.. అందుకే వారి చదువుపై దృష్టిపెట్టినట్లే ఏమి తింటున్నారో అనే విషయంపై అనుక్షణం ఓ కన్నేసి ఉంచాలి.. ఒక్కసారి జంక్ ఫుడ్ భారిన పడిన తరువాత ఆ ప్రభావం వారిపై జీవితాంతం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

రక్తహీనత, ఊబకాయం

జంక్‌ఫుడ్ కారణంగా బాలికల్లో రక్తహీనత, బాలురలో ఊబకాయం పెరుగుతోంది. కొంత మంది మగ పిల్లలు సరిగ్గా ఆహారం తినకపోయినా లావుగా ఉంటారు. దీనికి కారణం శరీరంలో జంక్‌ఫుడ్ వ్యర్థాలు పేరుకుపోవడమే. బాలికల్లో జంక్‌ఫుడ్ కారణంగా సరైన సమయంలో పీరియడ్స్ రాకపోవడం.. నరాలు నొప్పులు, కంటిచూపు తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరం అంటూ హెచ్చరికలు చేస్తున్న ప్రభుత్వాలు అదే స్థాయిలో జంక్‌ఫుడ్ ప్రమాదమని హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే సినిమా థియేటర్లలో వీటి బారిన పడకుండా ప్రచార చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. అంతేగాక జంక్‌ఫుడ్ నుంచి పిల్లలను రక్షించాలంటూ భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిబంధనల్ని జారీ చేసింది. ఆల్కహాల్ వంటివి చేసే నష్టం కంటే జంక్‌ఫుడ్ ఇంకా ఎక్కువ నష్టం చేస్తుందని స్పష్టం చేసింది. జంక్ ఫుడ్ బారిన పడే వారి సంఖ్య రోజు రోజుకూ అధికమవుతోందని వాటి నియంత్రణలో కఠిన చర్యలు చేపట్టకపోతే అనారోగ్య భారత్‌ను చూడవలసి వస్తుందని తెలిపింది.

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్యాకింగ్ ఫుడ్‌లో అతి ప్రమాదకరంగా ఉండే రసాయనాలను ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధించింది. కానీ అవి జంక్‌ఫుడ్ తయారీదారులు వాటిని వాడుతూనే ఉంటారు. రుచి, ఫ్లేవర్, కలర్స్, అధిక తీపి వంటి వాటికోసం వీటిని వాడుతుంటారు. కానీ ఇవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంటాయి. అందుకే జంక్‌ఫుడ్ తయారీ దారుల దగ్గర ఎఫ్ఎస్ఎస్ఏఐ ముద్రలేని ప్యాకింగ్‌లు మాత్రమే ఉంటాయి. ముఖ్యంగా ప్రోఫైల్ గానెట్, పొటాషియం బ్రిమెట్, మోనోసోడియం గ్లూటామెట్, డై ఏసిటల్ వంటి రసాయనాలపై నిషేధం విధించింది. కానీ ఇవి జంక్‌ఫుడ్ తయారీదారులు దగ్గర అందుబాటులో ఉంటాయి. అంతేగాక అధిక తీపిని ఇచ్చే హై ఫ్రక్టోజ్ కార్న్ సిరప్ రసాయనం కూడా వినియోగించకూడదని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు జారీ చేసింది. దీని వల్ల షుగర్, కిడ్నీ సమస్యలు తలెత్తున్నాయని దీనిపై నిషేధం విధించారు. పంచదార కంటే దీని ధర తక్కువగా ఉండటంతో వ్యాపారులు దీనిని వాడుతుంటారు. దీనిని మనం తాగే శీతల పానీయాల్లో వినియోగిస్తుంటారు.

పేరుకుపోతున్న వ్యర్థాలు..

ఫాస్ట్‌ఫుడ్, ఇతర ఆహారం వల్ల నేటి తరంలో అన్ని వయస్సుల వారి పొట్టల్లో వ్యర్థాలు పేరుకుపోయాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే చిన్న పిల్లలు సరాసరిన రోజుకు 30 నుంచి 50 గ్రాముల వరకు చాక్లెట్‌లను తింటున్నారని ఒక అంచనా.. ఈ కారణంగా ఆయా వయసుల వారీగా ప్రతి ఒక్కరిలో 30 గ్రాముల నుంచి 100 గ్రాముల వరకు వ్యర్థాలు ఉంటున్నాయి. వీటి ప్రభావం ఎముకల ఎదుగుదలపై పడి మనిషి పెరుగుదలపై ప్రభావం చూపుతున్నాయి. అంతేగాక ఫాస్ట్ ఫుడ్‌లలో వాడే మైదా, నూనె వంటి వాటితో విష, కొంకి, బద్దెపురుగులు, ఏలికపాములు వంటివి శరీరంలోకి చేరుతున్నాయి. ఇవి కూడా ఎముకల ఎదుగుదలపై ప్రభావం చూపుతుంటాయి.



ఎఫ్ఎస్ఎస్ఏఐ మార్గదర్శకాలు

- పాఠశాలలకు, విద్యార్థుల వసతి గృహాలకు 50 మీటర్ల వరకు చిరుతిళ్ల దుకాణాలపై నిషేధం
- పిల్లలకు ఇచ్చే స్నాక్స్ బాక్సుల్లో సాధ్యమైనంత వరకు ఫ్రూట్ సలాడ్‌లు, పల్లీలు, బెల్లంతో చిక్కీలు, లడ్డూలు, రాగులు, జొన్నలు, సజ్జలుతో తయారు చేసే వంట కాలు ఉండేలా చూడాలి.
- ఒక్కసారి తింటే ఏమవుతుంది అని జంక్‌ఫుడ్ విషయంలో తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించకూడదు.
- పిల్లలు రోజూ తినే ఆహారంలో 300 గ్రాముల కూరగాయలు, వీటిలో ఆకుకూరలు 50 గ్రాములు, దుంపలు 50 గ్రాముల ఉండేలా చుసుకోవాలి.
- దుకాణాల్లో అమ్మే చిరుతిళ్లపై ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీలను నిర్వహిస్తూ ఉండాలి.
- ఆర్థిక పరిస్థితి సహకరించని కుటుంబాల్లో ఆ ఇంట్లో వండిన ఆహారాన్ని మాత్రమే పిల్లలకు అందించాలని ఎట్టి పరిస్థితుల్లో బయటనుంచి తెచ్చిచిరుతిళ్ల పెట్టకూడదు.

రక్తహీనత పెరిగింది

గత ఐదేళ్లలో అన్ని వయస్సుల మహిళల్లో రక్తహీనత సమస్య బాగా పెరిగింది. ముఖ్యంగా బాలికల్లో ఈ సమస్య అధికంగా కనిపిస్తుంది. జంక్‌ఫుడే దీనికి ప్రధానకారణం. పిజ్జాలు, బర్గర్లు, నూడిల్స్, కేక్‌లు తింటూ ఉండేవారిపై ఈ సమస్య కనిపిస్తుంది. దీంతో సరైన సమయంలో పీరియడ్స్ రావు. ఒకోసారి రెండు నెలలకు ఒకసారీ కూడా రాకుండా ఉంటాయి. ఈమధ్య ఇటువంటి సమస్యలతో ఎక్కువమంది వస్తున్నారు. వీటికి మందులతో పూర్తిగా పరిష్కరించలేం. ఆహారపు అలవాట్లు పూర్తిగా మార్చుకోవాలి. ఇంట్లో వండేవాటినే తినాలి. అలాగే పండ్లు, మాంసాహారం తీసుకోవాలి.



ఎస్ ఉమాజ్యోతి, ప్రొఫెసర్, మానసిక వ్యాధుల నిపుణులు, జీ జీ హెచ్

వసతి గృహాల్లో..

● శుభ్రమైన తాగునీరును అందించాలి. ● తృణధాన్యాలు, పాలు, గుడ్లు ఇతర పౌష్టికాహారంతో కూడిన మెను ఉండాలి. ● తాజా, గుర్తింపు పొందిన ఉత్పత్తులను వంటకు ఉపయోగించాలి. వంటనూనె రోజుకు ఒకసారి వినియోగించాలి. అది రోజూ ఒక చిన్నారికి అందించే ఆహారంలో 25 గ్రాములు మించ కూడదు. ● క్యాంటీన్‌లలో మిఠాయిలు, ఫ్రెంచ్‌ఫ్రైస్, బర్గర్లు, చిప్స్, పిజ్జా, సమోసాలు, నూడిల్స్, శీతలపానీయాలు పూర్తిగా నిషేధించాలి. కాకపోతే ఎఫ్ఎస్ఎస్ఏఐ మార్గదర్శకాలు జిల్లాలోనే కాదు, పూర్తిగా రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదు.



తల్లిదండ్రులే జాగ్రత్తగా ఉండాలి..

ఆరోగ్యం పట్ల ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయని అనుకోవడం కన్నా, వీటి ప్రభావం నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంది. దీనికి తోడు పిల్లలకు అందుబాటులో ఉండే ఆహారాన్ని మాత్రమే ఇష్టపడుతుంటారు. వారికి అందుబాటులో ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉంచే బాధ్యతను కూడా తల్లిదండ్రులే చూసుకోవాలి. తయారు చేసుకునే ఆహారం నిల్వ ఉన్నప్పటికి అది తీసుకుంటే అంతగా శరీరంపై ప్రభావం చూపదు. కానీ జంక్‌ఫుడ్ అలా కాదు, శరీరంలోనే పేరుకుపోతుంది. అంతేగాక నాడీ వ్యవస్థ, జీర్ణవ్యవస్థ, మెదడు, గుండెతో పాటు 18 రకాల అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతుంది. జంక్ ఫుడ్‌కు అలవాటు పడిన పిల్లల ప్రవర్తన కూడా వింతగా ఉంటుందని, విపరీత మనస్తత్వంతో పాటు, చిన్న చిన్న కారణాలకు ఆవేదన చెందుతూ ఆత్మహత్యల వైపు వెళ్తూ ఉంటారని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



చిన్నారులకు అందాల్సినవి...

7-10 మధ్య వయస్సు కలిగిన అబ్బాయిలకు 77 గ్రాములు, 11-14 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారికి 86 గ్రాములు కొవ్వు పదార్థాలు ఉండే ఆహారాన్ని అందించాలి. అమ్మాయిలకు 68 గ్రాములు, 70 గ్రాముల అందాలి. 14 సంవత్సరాల లోపు వరకు అమ్మాయిలకు, అబ్బాయిలకు గాని 170-250 గ్రాములు కార్బోహైడ్రేట్లు ఆహారంలో ఉండాలి. ఉడికించిన ఆహార పదార్థాలు అయినా గానీ అధిక ఉప్పు, కారం, నూనె లేకుండా చూడాలి. పాలు, గుడ్లతో పాటు ప్రతి రెండు రోజులకు ఒకసారి మాంసాహారాన్ని అందించాలి.



వారెక్కడ?

- రికార్డుల్లో ఉన్నారు.. మ్యాపింగ్‌లో లేరు
- మూడు నెలలుగా కొలిక్కిరాని కసరత్తు
- హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో పట్టణ ప్రాంతాలు వెనుకంజ
- గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో సర్వేకు దూరంగా పలు గృహాలు

2.19 లక్షల మంది జాడలేదు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): 2,19,767 పౌరులు అదృశ్యమయ్యారు. వారంతా రికార్డుల్లో ఉన్నారు. కానీ ఎక్కడున్నారో తెలియడంలేదు. మూడు నెలలుగా కసరత్తు చేస్తున్నా వారి జాడ తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గ్రామ, వార్డు సచివాలయల పరిధిలో ఎవరు ఉన్నారో.. ఎవరు లేరో.. తేలితే పథకాలు అమలు చేయడం తేలిక అని కూటమి ప్రభుత్వం భావించింది. ఈ ఉద్దేశంతో మూడు నెలల క్రితం సచివాలయాల పరిధిలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ సర్వేకు ఆదేశించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి ఇంటిని యాప్‌లో మ్యాప్ చేసి, అందరి వివరాలు నమోదు చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించింది. అయితే జనాభా లెక్కల రికార్డుల్లో ఉన్న వారు ఆయా ఇళ్లలో లేరు. ఇళ్లలో ఉన్న వాళ్ళు జనాభా లెక్కల రికార్డుల్లో లేరు. ప్రభుత్వం మూడు నెలల క్రితం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హౌస్‌హోల్డ్ సర్వేలో ఇలాంటి వింత అనుభవాలు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అనేకం వెలుగుచూస్తున్నాయి.

ఇల్లు ఉంది మనుషులు లేరు..

సచివాలయాలను క్లస్టర్లుగా విభజించి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌ను సిబ్బంది చేపట్టారు. మూడు నెలలుగా సచివాలయ సిబ్బంది వారి పరిధిలోని ఇళ్లకు వెళ్తున్నా చాలాచోట్ల అసమగ్ర సమాచారం లభ్యమవుతోంది. ఉమ్మడి మూడు జిల్లాలో చాలా గృహాల్లో అసలు మనుషులు లేనట్లు తేలుతుంది. ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఇంటి యజమాని వేరే చోట ఉండడంతో మ్యాపింగ్ ప్రక్రియ ఆలస్యం అవుతుంది. మూడు నెలలుగా ఈ కసరత్తు జరుగుతున్నా ఇంతవరకు ఒక కొలిక్కి రాలేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో ఇంకా చాలా గృహాలు

(మిగతా 8వ పేజీలో)

కష్టంగా గుర్తింపు

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువ మంది పౌరుల జాడ తెలియడంలేదు. వారిని గుర్తించి సర్వే పూర్తి చేయడం సచివాలయ సిబ్బందికి కత్తిమీద సాములా మారింది. గుంటూరు, తెనాలి, పొన్నూరు, తాడేపల్లి, మంగళగిరి పట్టణాల్లో ఎక్కువగా సిటిజన్స్ మిస్సింగ్ ఉంది. గుంటూరు జిల్లాలో 1,17,168 మంది, పల్నాడు జిల్లాలో 91,693 మంది, బాపట్ల జిల్లాలో 10,906 మంది సిటిజన్స్ మిస్సింగ్ అని లెక్కలు చెబుతున్నాయి. వీరంతా ఇక్కడ జనాభా లెక్కల్లో నమోదై వేరే ప్రాం తంలో ఉండడంతో మిస్సింగ్ కింద చూపిస్తున్నారు.

పెంచకపోగా.. కుదింపా?

- రైల్వే బోర్డు నిర్ణయంపై ఆందోళన
- దక్షిణ కోస్తా రైల్వే జోన్‌తో గుంటూరుకు నష్టం
- సరుకు రవాణాతోనే డివిజన్‌కు 64 శాతం ఆదాయం
- లోడింగ్ స్టేషన్లు దక్షిణ మధ్య రైల్వేలోకి వెళ్లేలా ప్రతిపాదనలు
- వాటిని ఆమోదిస్తే గుంటూరు రైల్వే డివిజన్ ఉనికికే ప్రమాదం
- నడికుడి - శ్రీకాళహస్తి రైలుమార్గం పూర్తి అయితేనే పునర్ వైభవం



గుంటూరు రైల్వే డివిజన్‌లో సరుకు రవాణా టెర్మినల్

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో గుంటూరు డివిజన్ పరిధి కుదించుకుపోనుంది. పొరుగున ఉన్న విజయవాడ డివిజన్‌కు అదనంగా మోటుమర్రి సెక్షన్‌ని ఇచ్చిన రైల్వేబోర్డు గుంటూరు డివిజన్ పరిధిని పెంచకపోగా తగ్గించేందుకు అడుగులు వేస్తుండటంపై ఇక్కడి అధికారవర్గాలు ఆం దోళన చెందుతున్నాయి. ఆదాయంలో సింహ భాగం సరుకు రవాణాపై ఆధారపడి ఉన్న గుంటూరు రైల్వే డివిజన్‌కి కొత్త సమస్య వచ్చి పడింది. ప్రత్యామ్నాయంగా నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలుమార్గం సంపూర్ణమైతేనే సరుకు రవాణ పెరగడానికి ఆస్కారం ఉంటుంది. అప్పటివరకు (మిగతా 8వ పేజీలో)

సమష్టిగా తిరునాళ్లను విజయవంతం చేద్దాం


- అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి గొట్టిపాటి
- కోటప్పకొండలో ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, అరవిందబాబు

కోటప్పకొండ(నరసరావుపేట రూరల్), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండలో నిర్వహించే తిరునాళ్ల మహోత్సవాన్ని సమష్టి కృషితో విజయవంతం చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజా ప్రతినిధులు, అధికారులకు సూచించారు. కోటప్పకొండలో తిరునాళ్ల ఏర్పాట్లను మంత్రి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబులతో కలిసి శనివారం పరిశీలించారు. కాలింది మడుగు, పర్యాటక కేంద్రం, ఫుడ్ కోర్టు, ఘాట్ రోడ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తిరునాళ్లకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. తిరునాళ్ల ఏర్పాట్లపై వైసీపీ నేతలు లేనిపోని విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. నరసరావుపేట ఎంపీ మాట్లాడుతూ తిరునాళ్లలో ట్రాఫిక్, శానిటేషన్ సమస్య ఎక్కువగా ఉండే అవ కాశం ఉన్నందున ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ భక్తుల మనోభావాలకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తు న్నామన్నారు. తిరునాళ్లలో సీసీ కెమేరాలతో నిఘా ఉంటుందన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రబ్బానీ



గుంటూరు సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షునిగా సయ్యద్ గౌస్ రబ్బానీ ఎన్నికయ్యారు. గుంటూరు కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఏపీఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బి.సుజాత, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.విజయలక్ష్మి, వై.వీరాంజనేయులు, ఎస్.కనకాంబరం, కె.జ్యులిత్, కార్యదర్శిగా సంకుల ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శులుగా కె.నాగ సులోచన, ఎన్‌వీ శివయ్య, షేక్ తాజుద్దీన్, కోశాధికారిగా బీహెచ్ పి శేషసాయి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎస్ కే ఇబ్రహీం హలీలుల్లా, డి.రవికిరణ్, సీహెచ్ ఎస్ఆర్‌కే శర్మ, ఆర్ సాయికృష్ణ ఎన్నికయ్యారు.

మ్యూజియంను సందర్శించిన బౌద్ధ భిక్షువులు



మ్యూజియంలో అంతర్జాతీయ బౌద్ధ భిక్షువులు

మాచర్లటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున కొండపై గల మ్యూజియాన్ని శనివారం అంతర్జాతీయ బౌద్ధ భిక్షువులు సందర్శించారు. శ్రీలంక, మయన్మార్ కంబోడియా, లావోస్, థాయిలాండ్, వియత్నాం తోపాటు భారతదేశానికి చెందిన 27 మందితో కలిపి మొత్తం 88 మంది బౌద్ధ భిక్షువులు నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో అంతర్జాతీయ త్రిపిటిక పఠనోత్సవంలో పాల్గొనేందుకు వచ్చారు. శనివారం వీరు మ్యూజియంలోని బుద్ధుని పాలరాతి విగ్రహం, శిలాశాసనాలు, శిల్పాలను ఆసక్తిగా తిలకించారు. మ్యూజియం విశేషాలను పురావస్తు పరిశోధకుడు, బుద్ధవనం కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి బౌద్ధ భిక్షువులకు వివరించారు. కార్యక్రమంలో బుద్ధవనం అధికారులు డీఆర్ శ్యాంసుందరరావు, డాక్టర్ రవిచంద్ర పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 545.90 అడుగులు ఉంది. ఇది 200.83 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7518 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 27,910 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 48,028 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 28,102 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఎడ్ల పోటీలతో రైతుల్లో ఉత్సాహం

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



మోర్జంపాడులో యరపతినేనికి షీల్డ్ బహూకరిస్తున్న దున్నా చెన్నయ్య చౌదరి

మాచవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం వచ్చిందంటే గ్రామీణ ప్రాంతాల్లో తిరునాళ్ల సందర్భంగా జరిగే ఎడ్ల బల ప్రదర్శన పోటీలు రైతుల్లో ఉత్సాహాన్ని నింపుతాయని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శనివారం అన్నారు. మండలంలోని మోర్జంపాడు గ్రామంలోని నరసింహా స్వామి 69వ కల్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులే కాకుండా వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు కూడా పందెపు ఎద్దులను పెంచుతున్నారని తెలిపారు. తొలుత మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయంలో శివలింగానికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ అర్చకులు ఘన స్వాగతం పలికి పూలమాలలతో, దుశ్శాలువాలతో యరపతినేనిని సత్కరించారు. ఎడ్ల పోటీల నిర్వాహకులు యరపతినేని శ్రీనివాసరావు చేత పోటీలు ప్రారంభింప చేశారు. పోటీలు ప్రారంభం అనంతరం జిల్లా తెలుగు రైతు సంఘం ఉపాధ్యక్షుడు దున్నా చెన్నయ్య చౌదరి యరపతినేనికి షీల్డ్ బహూకరించారు.

బాపట్ల, గుంటూరు కంబైన్డ్ జతకు ప్రథమ స్థానం

జతపళ్ల విభాగంలో బాపట్ల జిల్లా సంతమాగులూరు గ్రామానికి చెందిన వజ్రాల తేజశ్రీరెడ్డి, గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన మోపర్తి నవీన్ కుమార్ చౌదరి కంబైన్డ్ ఎడ్లు 3739 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం మాదల గ్రామానికి చెందిన జువ్వాజీ మేఘనా నాయుడు ఎడ్లు 3653.4 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానంలో నిలిచాయి. 3, 4 స్థానాలను ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకివీడు గ్రామానికి చెందిన పచ్చిగారి హరికృష్ణ నాయుడు, విజయలక్ష్మి నాయుడు, గుంటూరు జిల్లా కొల్లిపర గ్రామానికి చెందిన గుదిబండి శ్రీనివాసరెడ్డి ఎడ్లు 3,600 సమాన అడుగుల దూరాన్ని లాగి 3, 4 స్థానాలు, పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం మాచాయపాలెం గ్రామానికి చెందిన గౌరు కార్తికేయ ఎడ్లు 3291.4 అడుగుల దూరాన్ని లాగి ఐదో స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం ఇస్సపాలెం గ్రామానికి చెందిన జెల్లి నాగ మల్లేశ్వరరావు ఎడ్లు 3219.2 అడుగుల దూరాన్ని లాగి ఆరో స్థానంలో, ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం అంకలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మల్లెబోయిన నాగార్జున ఎడ్లు 3179.6 అడుగుల దూరాన్ని లాగి 7వ స్థానంలో నిలిచాయి. వీరికి వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులతో పాటు షీల్డ్‌లను బహూకరించారు. వీరికి గ్రామానికి చెందిన తొగత వీర క్షత్రియ సంఘం వారు బహుమతులను అందజేశారు. నిర్వాహకులుగా కృష్ణ జిల్లా పెనుమచ్చ గ్రామానికి చెందిన సూరపనేని రాధాకృష్ణ వ్యవహరించారు.

కుంభమేళా ఆర్టీసీ స్పెషల్ బస్సుకు అనూహ్య స్పందన

గుంటూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు నుంచి మహా కుంభమేళాలో పుణ్య స్నానాలకు (ప్రయాగరాజ్) కు వెళ్లే వారి కోసం ఆర్టీసీ గుంటూరు-2 డిపో అధికారులు ఏర్పాటు చేసిన స్పెషల్ హైటెక్ (2+2) పుష్ బ్యాక్ సూపర్ లగ్జరీ బస్సుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ముందుగా ప్రకటించినట్లుగా ఈనెల 11న వెళ్లే స్పెషల్ బస్సుకు ప్రయాణికుల నుంచి టిక్కెట్ బుకింగ్స్‌తో ఫుల్ అయిపోయినట్లు డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన స్పందనకు అనుగుణంగా ఈనెల 15న అదనంగా మరో సర్వీసు మహా కుంభమేళాకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 15న గుంటూరు బస్టాండ్‌లో ఉదయం 10 గంటలకు బస్సు బయల్దేరుతుందన్నారు. మొత్తం 8 రోజుల్లో తొలి రోజు గుంటూరు నుంచి బయల్దేరి రెండో రోజు సాయంత్రానికి కుంభమేళా ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటుందన్నారు. మూడో రోజు మొత్తం ప్రయాగరాజ్‌లో బస చేసి పుణ్య స్నానాలు ఆచరించి, 4వ రోజు రాత్రికి అయోధ్య చేరేందుకు బయల్దేరుతుందన్నారు. 5వ రోజు ఉదయం అయోధ్య చేరుకొని, బాలరాముని దర్శించుకొని, సాయంత్రానికి వారణాసి బయల్దేరుతుందని తెలిపారు. ఆరో రోజు ఉదయం వారణాసి చేరుకొని, ఆ రోజు వారణాసిలో బస చేసి ఏడో రోజు ఉదయం వారణాసి నుంచి బయలు దేరి ఎనిమిదివ రోజు రాత్రికి గుంటూరు చేరుకుంటుందన్నారు. ఈ సర్వీస్ కు 91927 ఆన్‌లైన్ సర్వీస్ నంబర్ ద్వారా రిజర్వేషన్ చేసుకొనే అవకాశం కూడా ఉందని డీఎం తెలిపారు. ఈ సదావకాశంను గుంటూరు, పరిసర ప్రాంత ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10 కిలోమీటర్లు లోపు 35 మంది ప్రయాణికులు ఒకే చోటు నుంచి బయల్దేరితే బస్సు అక్కడికి పంపుతామన్నారు. ఒక్కో టికెట్ ధర రూ. 8300 మాత్రమేననీ, ఇతర ఖర్చులు, భోజనం, వసతి ఖర్చులు ఎవరి ఖర్చులు వారే భరించాల్సి ఉంటుందన్నారు. పవిత్ర త్రివేణి సంగమంలో స్నానమాచారించి, శుద్ధిని, మోక్షాన్ని పొందుటకు ఈ అవకాశంను ఉపయోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7382897459, 7382896403, 7382894613 సంప్రదించాలన్నారు.

ముగిసిన మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాలలో గౌడ, గౌడ్ సామాజిక వర్గాల మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ శనివారం రాత్రి ముగిసిందని గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. గుంటూరు జిల్లాలో 13 షాపులకుగానూ 233 దరఖాస్తులు, పల్నాడు జిల్లాలో 13 షాపులకుగానూ 199 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటన్నిటికీ ఈ నెల 10న లాటరీ నిర్వహించి షాపుల లైసెన్స్ దారులను ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఏకతాటిపైకి రావాలి

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మాల ఉద్యోగులందరూ ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందని ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీసెస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి అన్నారు. పాతగుంటూరు గంగానమ్మ కమ్యూనిటీ హాల్‌లో శనివారం మాల ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

భూములను ఆక్రమించి.. గ్రామ బహిష్కరణ చేశారు

● పల్నాడు కలెక్టరేట్‌ను ఆశ్రయించిన రామాంజనేయపురం ఎస్టీ కాలనీవాసులు



కలెక్టర్ కార్యాలయ ఆవరణలో భూమి పట్టాలు చూపుతున్న రామాంజనేయపురం బాధితులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ బహిష్కరణ చేసి.. నిత్యావసర వస్తువులు, నీరు ఇవ్వడంలేదు.. అంటూ పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం మన్నే సుల్తాన్‌పాలెం శివారు రామాంజనేయ పురం ఎస్టీకాలనీవాసులు శనివారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌కి వచ్చారు. రెండో శనివారం కావడంతో అధికారులు అందుబాటులో లేకపోవడంతో వారు కార్యాలయం సమీపంలో మీడియాకు తమ గోడు చెప్పారు. అటవీ హక్కు చట్టప్రకారం ప్రభుత్వం 20 మందికి 71 ఎకరాలు పట్టాలు ఇచ్చిందనీ, అయితే వర్షా భావ పరిస్థితిలో జీవనం కోసం సమీప పట్టణాలు, ఇతర ప్రాంతాలకు వలసలు పోయామన్నారు. దీంతో తమ భూములను కొంతమంది దళారుల సహాయంతో ఆక్రమించారన్నారు. భూముల కోసం తాము రామాంజనేయపురం రాగా సర్పంచి భర్త రాము మరికొందరు తమపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో ఉండడానికి వీలు లేకుండా నిత్యావసర వస్తువులు, నీరు ఇవ్వకుండా గ్రామ బహిష్కరణ చేశారని తెలిపారు. లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షుడు సబావత్ తావులాల్‌నాయక్, పోలా దుర్గమ్మ, పోలా గురవమ్మ, వజ్రగిరి కోటయ్య, వజ్రగిరి నాగయ్య, బుజ్జమ్మ, నేనావత్ దేవికాబాయి, సభావత్ లీలాబాయి, సభావత్ కిమినిబాయి, దానవత్ భద్రిబాయి, కొర్ర శివలాల్, రామవత్ నాగనాయక్, రామవాత్ సరోజబాయి తదితరులు కలెక్టరేట్‌ను ఆశ్రయించిన వారిలో ఉన్నారు.

వారెక్కడ?

(5పేజీ తరువాయి)

మ్యాపింగ్‌కు దూరంగానే ఉన్నాయి.

ఓటీపీ చెప్పకపోవడంతో జాప్యం

సర్వే ప్రక్రియలో ఇంటి యజమాని ఫొటో, బయో మెట్రిక్, ఓటీపీ ద్వారా వివరాలు ఖరారు చేయాలి. మనిషి అందుబాటులో లేకపోయినా మ్యాపింగ్ చేయవచ్చు. మ్యాపింగ్‌కు మనిషి దగ్గర ఉండాల్సిన పనిలేదు. వారెక్కడ ఉంటున్నా ఓటీపీ చెబితే సచివాలయ సిబ్బంది మ్యాప్ చేస్తారు. కానీ సైబర్ నేరాలు మీద ప్రజలు అప్రమత్తంగా ఉండడంతో సచివాలయ సిబ్బంది అని చెప్పినా అంత తేలికగా ఓటీపీ చెప్పడం లేదు. దానివల్ల హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ప్రక్రియలో జాప్యం జరుగుతుంది. ఓటీపీ వ్యవహారంలో ఎదురౌతున్న అనుభవాలను జిల్లా అధికారులు రాష్ట్ర అధికారులకు నివేదించడంతో యాప్‌లో మార్పులకు శ్రీకారం చుట్టారు.

మరో 15 రోజులు గడువు..

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌పై అధికారులు చాలా సీరియస్‌గా ఉన్నారు. మరో 15 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర అధికారులు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సర్వే పూర్తి కావడానికి వీలుగా యాప్‌లో మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. తాజా అప్ డేట్ ప్రకారం ఇంటి దగ్గరకు వెళ్లి యజమాని వివరాలు సరిచూసుకుని సిబ్బంది యాప్‌లో ఎస్ అని కొడితే సర్వే పూర్తి అవుతుంది. ఈ సర్వేలో లేని వారికి ఆ సచివాలయ పరిధిలో ప్రభుత్వ పథకాలు పొందే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. కాబట్టి పౌరులు కూడా బాధ్యతగా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ సర్వేలో పాల్గొనాలని అధికారులు సూచిస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	113,121,132
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం : గుంటూరు

డి.నెం.135-43, 1వ అంతస్థు, యస్‌బిఐ పైన, లక్ష్మీ కాంప్లెక్స్, జెకెసి కాలేజి రోడ్, గుంటూరు. ఫోన్ : 0863 - 2215537, Mail ID : rogtr-ee1@appcb.gov.in

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ప్రకటన నెం.యస్.ఓ.1533 తేది.14-09-2006 అనుసరించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, గుంటూరు వారు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా M/s. రాధాకృష్ణ మినరల్స్, సున్నపురాయి (మైనర్) త్రవ్వకం - 46,235 టన్నులు/సంవత్సరం, సర్వే నెం.338/7-3, 338/7-4, 338/7-5, 338/7-6, 338/7-7 & 338/7-8, పాపాయపాలెం గ్రామం, బెల్లంకొండ (మండలం), పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ వద్ద రూ.25 లక్షల పెట్టుబడితో ప్రతిపాదన మూలధన వ్యయంతో ప్రాజెక్ట్ వివరాలు ఈ క్రింద విధముగా పొందుపర్చబడినది.

1	కంపెనీ పేరు చిరునామాతో	M/s. రాధాకృష్ణ మినరల్స్, పాపాయపాలెం గ్రామం, బెల్లంకొండ మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ మొబైల్ : 9908313713, ఇ-మెయిల్ : radhakrishnaminerals2021@gmail.com
2	ప్రతిపాదిత ప్రాజెక్ట్ ప్రదేశం, సర్వే నెంబర్లు మరియు స్థలము/లు కొలతలు	సర్వే నెంబర్లు : సర్వే నెం.338/7-3, 338/7-4, 338/7-5, 338/7-6, 338/7-7 & 338/7-8, పాపాయపాలెం గ్రామం, బెల్లంకొండ (మండలం), పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్
3	సంప్రదించవలసిన అధీకృత వ్యక్తి పేరు, చిరునామా & ఫోన్ నెం.	శ్రీ ఉన్నం నాగ మల్లికార్జునరావు, తండ్రి : నరసింహారావు, డోర్ నెం.16-567, ఉన్నం హాస్పిటల్స్, గంగమ్మ గుడి రోడ్ దగ్గర, మెయిన్ రోడ్, పిడుగురాళ్ళ గ్రామం & మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522413. మొబైల్ : 9908313713.
4	ప్రాజెక్ట్ అంచనా వ్యయం	రూ.25 లక్షలు
5	కార్యకలాపాల వివరములు మరియు సామర్థ్యం	సున్నపురాయి సంవత్సరమునకు సగటున 46,235 టన్నులు ఉత్పత్తి చేయదానికి 2.168 హెక్టార్లు (6.47 ఎకరాలు) విస్తీర్ణంలో ప్రతిపాదన
6	బహిరంగ విచారణ తేది / ప్రదేశం / సమయం	తేది : 11-03-2025 (మంగళవారం) సమయం : ఉదయం గం॥ 11:30 ని॥లకు ప్రదేశం : ప్రతిపాదిత స్థలం దగ్గర, M/s. రాధాకృష్ణ మినరల్స్, సర్వే నెం.338/7-3, 338/7-4, 338/7-5, 338/7-6, 338/7-7 & 338/7-8, పాపాయపాలెం గ్రామం, బెల్లంకొండ మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్
7	ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కార్యనిర్వాహక సారాంశము (తెలుగు మరియు ఆంగ్లం) మరియు పర్యావరణ ప్రభావ అంచనా రిపోర్టులు ప్రజల పరిశీలనార్థం దిగువ ప్రదేశములనందు ఉంచడమైనది.	

1. కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయం, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
2. రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ వారి కార్యాలయం, సత్తెనపల్లి మండలం, పల్నాడు జిల్లా.
3. ముఖ్య కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయం, జిల్లా పరిషత్, గుంటూరు.
4. జాయింట్ డైరెక్టర్, పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ కార్యాలయం మరియు క్లైమేట్ ఛేంజ్, భారత ప్రభుత్వం, సమీకృత ప్రాంతీయ కార్యాలయం(ఐఆర్ఓ), గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్, విజయవాడ-520010.
5. మెంబర్ సెక్రటరీ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి బోర్డ్, పర్యావరణ్ భవన్, ఎపిఐఐసి కాలనీ రోడ్, గురునానక్ కాలనీ, ఆటోనగర్, విజయవాడ-520007.
6. జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జోనల్ కార్యాలయం, ఫ్లాట్ నెం.41, కనకదుర్గ ఆఫీసర్స్ కాలనీ, గురునానక్ రోడ్, విజయవాడ.
7. ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, ప్రాంతీయ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, డి.నెం.135-43, మొదటి అంతస్థు, యస్‌బిఐ బిల్డింగ్ పైన, లక్ష్మీ కాంప్లెక్స్, జెకెసి కాలేజి రోడ్, గుంటూరు.
8. జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల అధికారి, జిల్లా పరిశ్రమల కేంద్రం, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
9. తహసీల్దార్ వారి కార్యాలయం, మాచవరం గ్రామం & మండలం, పల్నాడు జిల్లా.
10. తహసీల్దార్ వారి కార్యాలయం, బెల్లంకొండ మండలం, పల్నాడు జిల్లా.
11. తహసీల్దార్ వారి కార్యాలయం, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా.
12. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం : పాపాయపాలెం గ్రామం, బెల్లంకొండ (మండలం), పల్నాడు జిల్లా.
13. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం : మన్నేసుల్తాన్‌పాలెం గ్రామం, బెల్లంకొండ (మండలం), పల్నాడు జిల్లా.
14. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం : మచ్చాయపాలెం గ్రామం, బెల్లంకొండ (మండలం), పల్నాడు జిల్లా.
15. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం : చంద్రాజుపాలెం గ్రామం, బెల్లంకొండ (మండలం), పల్నాడు జిల్లా.
16. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం : నాగిరెడ్డిపాలెం గ్రామం, బెల్లంకొండ (మండలం), పల్నాడు జిల్లా.
17. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం : హసనాబాద్ గ్రామం, క్రోసూరు (మండలం), పల్నాడు జిల్లా.
18. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం : చౌటప్పయ్యపాలెం గ్రామం, రాజుపాలెం (మండలం), పల్నాడు జిల్లా.
19. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం : నందిరాజుపాలెం గ్రామం, బెల్లంకొండ (మండలం), పల్నాడు జిల్లా.
20. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం : పిలుట్ల గ్రామం, మాచవరం (మండలం), పల్నాడు జిల్లా.
21. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం : కొత్తగణేషునిపాడు గ్రామం, మాచవరం (మండలం), పల్నాడు జిల్లా.
22. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం : అనుపాలెం గ్రామం, రాజుపాలెం (మండలం), పల్నాడు జిల్లా.
23. పంచాయతీ సెక్రటరీ వారి కార్యాలయం : మోర్జంపాడు గ్రామం, మాచవరం (మండలం), పల్నాడు జిల్లా.

ఈ ప్రతిపాదిత కార్యకలాపాల వలన పర్యావరణ పరంగా ఇబ్బందులను ఎదుర్కొనువారు కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, భారతప్రభుత్వం వారిచే జారీచేయబడిన పర్యావరణ ప్రభావ అంచనా ప్రకటన నెం. యస్.ఓ.1533, తేది.14-09-2006 మరియు తదుపరి సవరణలను అనుసరిస్తూ ప్రతిపాదిత ప్రాజెక్ట్ ఏర్పాటుపై ప్రజలు తమ అభిప్రాయాలు, సూచనలు, ఇబ్బందులు, వ్యాఖ్యలు ఏమైనా ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన 30 రోజులలోపు లిఖితపూర్వకముగా క్రింది సంతకందారునకు తెలియపరచవలని కోరడమైనది. లేదా పైన పేర్కొనబడిన తేది, సమయం, వేదిక నందు జరుగు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు, ఇబ్బందులు, వ్యాఖ్యలను తెలియజేయవచ్చును.

ప్రదేశం : గుంటూరు
తేది : 09-02-2025

సం/- ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్,
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, గుంటూరు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 33.07 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా మూడు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామని తెలిపారు.

నేడు కంటి వైద్య శిబిరం

గురజాలటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం పట్టణంలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో ఉచిత కంటి శుక్లముల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెదకాకానికి చెందిన శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్ కోరారు.

చిత్తడి నేలల దినోత్సవం

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల శనివారం చిత్తడి నేలల దినోత్సవాన్ని నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఎంఈవో-2 అల్లి సురేష్ విద్యార్థినులకు చిత్తడి నేలల దినోత్సవం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్స్ కార్ప్స్ జిల్లా కోఆర్డినేటర్ ఆయేషా సుల్తానా, హెచ్ఎం షేక్ షకీనా, నాగరాజు, మురళి, ఉష, కృష్ణారెడ్డి, రామీజున్, రత్నం పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి వేడుకలు

మాచర్లటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో గల సీతారామాలయంలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకుడు గుడిపూడి బ్రహ్మాచార్యులు ఆధ్వర్యాన స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అష్టోత్తర శతనామావలి, విష్ణు సహస్రనామ పారాయణం, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆలయానికి రూ. లక్ష విరాళం

దాచేపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి గ్రామ దేవత శ్రీ వీర్లంకమ్మ తల్లికి నారాయణపురం గ్రామానికి చెందిన అనిశెట్టి రమేష్, అరుణ దంపతులు అమ్మవారి వెండి పాద పీఠముల నిర్మాణానికి గాను రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎలమల నరేష్‌కు శనివారం రూ.లక్ష నగదు అందజేశారు.

బీజేపీ నేతలు సంబరాలు

మాచర్లటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో 27 సంవత్సరాల తరువాత బీజేపీ విజయం సాధించడం పట్ల మాచర్ల పట్టణంలో బీజేపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్కు సెంటర్లో స్వీట్లు పంపిణీ చేశారు. ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, భవిష్యత్తులో బీజేపీ మరింత బలపడి ప్రజలకు సేవలందించడంలో ముందంజలో ఉంటుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కూనిశెట్టి వెంకటేశ్వర్లు, యేచూరి అమర సురేష్, పోకూరి కాశీపతి, ఓర్సు క్రాంతికుమార్, బచ్చు రామారావు, కొమెర కాశయ్య, ఈశ్వరయ్య, మారం రాముడు, రాంబాబునాయుడు, ఏడుకొండలు, షాజిత్, కొలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన పెనుగంచిప్రోలుకు..

దాచేపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : 40 రోజుల మాలాధారణ పూర్తి చేసుకున్న లక్ష్మీ తిరుపమ్మ గోపయ్య స్వాములు పెనుగంచిప్రోలులోని లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానానికి చేరుకొనేందుకు శనివారం దాచేపల్లి మండలం తక్కెళ్ళపాడు నుంచి బయలు దేరారు. సుమారు 50 మంది స్వాములు, గురు స్వాములు జంగిలి అప్పారావు, కిష్టంశెట్టి ఫకీరయ్య ఆధ్వర్యంలో దాచేపల్లి నుంచి తంగెడ, హుజూర్‌నగర్, కోదాడ మీదుగా అమ్మవారి దేవస్థానానికి చేరుకుంటారు.

200 మందికి కంటి పరీక్షలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జానపాడు మండల పరిషత్ ఉర్దూ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పాలకేంద్రం అధ్యక్షుడు వున్నం శ్రీను ప్రారంభించారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లికి చెందిన శ్రీ కామాక్షి ఐకేర్ ఆస్పత్రి వైద్యులు వాసుదేవరావు, బాబూజీలు వైద్యశిబిరంకు హాజరైన 200 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వున్నం శ్రీను, కోటా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు

క్రోసూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొడ్లేరులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దొడ్లేరు ఎస్సీ కాలనీ ప్రధాన రహదారిలో సంచరిస్తున్న వ్యక్తి సమాచారాన్ని గ్రామస్థులు పోలీసులకు తెలియజేశారు. పోలీసులు వచ్చి ఆ వ్యక్తిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు ఇస్తుండటంతో అతడిని అదుపులోకి తీసుకొని క్రోసూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు.

రేపు ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ

క్రోసూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 10న మండలంలోని 16,642 మంది పిల్లలకు నులి పురుగుల మాత్రలు పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధనుష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తూకంలో చేతివాటం

- పంట కొనుగోలులో మోసాలకు పాల్పడుతున్న వ్యాపారులు
- సుమారు 10 కిలోల మేర దోపిడీ
- అధికారుల తనిఖీల్లో తూకంలో తేడాలు గుర్తింపు
- పలువురు వ్యాపారులపై కేసులు
- గత్యంతరం లేక వ్యాపారులకే పంటను అమ్ముతున్న రైతులు

పంట కొనుగోలు సందర్భంలో తూకంలో తేడాలకు పాల్పడుతూ వ్యాపారులు చేస్తున్న మోసానికి రైతులు భారీగా నష్ట పోతున్నారు. దిగుబడి ప్రారంభం కాగానే వ్యాపారస్తులు, దళారులు గ్రామాలపై వాలిపోయి రైతుల నుంచి పంట కొనుగోళ్లు చేస్తుంటారు. అప్పుల బాధలు, వడ్డీల భారాలను, వేధింపులు తట్టుకోలేక వచ్చిన దిగుబడులు అందిన కాడికి ఆయా వ్యాపారులకే తెగనమ్ముకుంటుంటారు. ఇందులోనూ వ్యాపారస్తులు, దళారులు తూకాల్లో చేతివాటాన్ని ప్రదర్శిస్తూ రైతులను నిలువునా ధగా చేసి దోచుకుంటున్నారు.



వ్యాపారస్థుల ఎలక్ట్రానిక్ కాటాలను తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు(ఫైల్)

క్రోసూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : క్రోసూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని రైతులు ప్రైవేట్ వ్యాపారస్తులు తూకాలలో చేస్తున్న మోసాలతో తీవ్రంగా నష్ట పోతున్నారు. పత్తి బోరం 100 కిలోలకు 110 కిలోలు వేస్తేనే కాటాలో వంద కిలోలు చూపిస్తోంది. అలాగే ధాన్యం 75 కిలోలకు కాటా చూపాలంటే 85 కిలోలు వేస్తూ వ్యాపారస్తులు దోచుకుంటున్నారు. మిర్చి రైతులూ అలానే నష్టపోతున్నారు. కొంతమంది వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాటాలతో తూకాలు వేస్తుండగా మరికొంత మంది మాత్రం సాధారణ తూకాలతోనే కాటాలు వేస్తున్నారు. ఇటీవల లీగల్ మెట్రాలజీ అధికారులు నియోజకవర్గంలోని నాలుగు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి ఎలక్ట్రానిక్ కాటాల్లో మోసాలను కనుగొని, వారిపై కేసులు నమోదు చేసిన సంఘటనలు ఉన్నాయి.

సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లలో సుమారు 10,500 ఎకరాల్లో వరి, 14,500 ఎకరాల్లో మిర్చి, 42 వేల ఎకరాల్లో పత్తి పంటను పండించారు. పత్తి పంట దాదాపుగా చివరి దశకు చేరుకోగా మిర్చి మాత్రం మూడో కోతకు సిద్ధంగా ఉంది. ధాన్యం ఖరీఫ్ పంట కూడా పూర్తయిపోయింది. అక్కడక్కడ రబీ పంటను వేస్తున్నారు. అధికారులు వ్యాపారులు కాటాల్లో మోసాలకు పాల్పడుతున్నప్పటికీ గత్యంతరం లేక వారికే పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితికి రైతులు నెట్టబడ్డారు. పత్తి కొనుగోలు కోసం సీసీఐ కేంద్రాలు, మిర్చి కొనుగోళ్ళ కోసం మార్కెట్ యార్డులు, ధాన్యం కొనుగోలు కోసం రైతు సేవా కేంద్రాలు ఉన్నప్పటికీ వారు విధించే నిబంధనలు, రవాణా ఛార్జీలు, ఇతర ఆర్థిక భారాలను తట్టుకోలేక రైతులు ప్రైవేట్ వ్యాపారస్తుల వైపే మొగ్గు చూపుతున్నారు. అయితే పంట కొనుగోలు సందర్భంలో ప్రైవేటు వ్యాపారులపై అధికారులు నిఘా పటిష్టం చేస్తే తమకు కొంత న్యాయం జరుగుతుందని రైతులు కోరుతున్నారు.



సాధారణ కాటాల్లో పత్తి తూకం వేయిస్తున్న వ్యాపారులు

తీవ్రంగా నష్ట పోతున్నాం



ప్రైవేట్ వ్యాపారస్తుల తూకాల మోసాలతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఒకవైపు పెట్టుబడి ఖర్చు పెరిగి, పంట దిగుమతి తగ్గి ఇక్కట్ల పాలవుతున్న రైతును ఇలా మోసం చేయటం అన్యాయం. మోసాలకు పాల్పడే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కంచేటి పెద్దబ్బాయి చౌదరి

పెట్టుబడి తేలే పరిస్థితి లేదు



దిగుబడులు తగ్గటం, పెట్టుబడులు అధికం కావటం, అకాల వర్షాలు రైతులను తీవ్రంగా నష్ట పరుస్తున్నాయి. కూలీల కొరత కూడా వేధిస్తోంది. ఈ క్రమంలో ప్రైవేట్ వ్యాపారస్తుల దోపిడీపై అధికారులు సరైన నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

- తిమ్మిశెట్టి హనుమంతరావు

తూకాల్లో భారీగా మోసాలు



పంటను కొనుగోలులో దళారుల, వ్యాపారస్తుల మోసాలు బహిరంగంగానే జరుగుతున్నాయి. ప్రభుత్వ సంస్థల్లో పంట అమ్ముకోవాలంటే రైతుకి అనేక నిబంధనలను అడ్డుగా ఉంటున్నాయి. ఈ పరిస్థితిని వ్యాపారులు వారి దోపిడీకి అనుకూలంగా మార్చుకుంటున్నారు.

- సిద్దయ్య, మిర్చి రైతు, అనంతవరం

ఆలపాటిని అఖండ మెజార్టీతో గెలిపించాలి

- పట్టభద్రుల ఆత్మీయ సమావేశంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా

నకరికల్లు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభ్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదును అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపు నిచ్చారు. శనివారం నకరికల్లు టీడీపీ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నకరికల్లు మండల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే కూటమి ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ చేసి చూపించిందన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాదుకు సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి అత్యంత భారీ మెజార్టీ అందించే దిశగా అందరూ కలసి కట్టుగా పని చేయాలని కోరారు. ప్రతి రోజు నేతలకు కేటాయించిన 30 నుంచి 40 మంది ఓటర్లను కలసి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. మేథావులు, విద్యావంతులు కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను బలపరిచి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య, పరిశీలకులు తాతా జయప్రకాష్ నారాయణ, షేక్ ఆలీ బాషా, సాగి శ్రీను, పూజల వెంకట కోటయ్య, అనుమోలు శ్రీనివాసరావు, బత్తిన శ్రీనివాసరావు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండాలి

- పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి
- డీఎస్పీ బీఎల్ఎన్ జగదీష్

రెంటచింతల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని గురజాల డీఎస్పీ బీఎల్ఎల్ జగదీస్ ప్రజలకు సూచించారు. శనివారం సత్రశాలలో గురజాల సబ్‌డివిజన్‌లోని సీఐ, ఎస్ఐలతో డీఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా, రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రత, బాల్య వివాహాలు, గంజాయి ఇతర మాదకద్రవ్యాలు, క్రికెట్ బెట్టింగ్, సైబర్ క్రైమ్, వైట్ కాలర్ నేరాలతో పాటు పెండింగ్‌లో వున్న కేసుల పురోగతి, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు తదితర విషయాలపై సుమారు నాలుగు గంటలపాటు చర్చించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, లింక్‌లపై క్లిక్‌లు చేయవద్దని దాని వలన కలిగే ఆర్థిక ఇబ్బందులను ప్రజలకు వివరంగా తెలియచేయడానికి పోలీసు సిబ్బంది కృషిచేయాలన్నారు. అలాగే వాహనదారులు నియమ, నిబంధనలను పాటించకపోవడంతో జరిగే దుష్పరిణామాలను వారికి వివరించాలన్నారు. మహా శివరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మండలాల వారీగా పెండింగ్‌లో వున్న కేసులను వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో సీఐలు వెంకట్రావ్, ఆవుల భాస్కర్, ప్రభాకర్, శ్రీనివాసరావు, పి.భాస్కర్, నఫీజ్ బాష, ఎస్ఐలు సిహెచ్ నాగార్జున, షఫీ, సుమందర్‌వలి, రవిబాబు, ప్రభాకర్, సుధీర్, వాసు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ బీఎల్ఎన్ జగదీష్

70 మందికి గుండె వైద్య పరీక్షలు

అచ్చంపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబడిపూడి గ్రామంలో శనివారం పెదకూరపాడు నియోజకవర్గ శాసన సభ్యుడు బాష్యం ప్రవీణ్ సూచనలతో విజయవాడకు చెందిన హెల్ప్ ఆస్పత్రి వైద్యబృందం రోగులకు గుండె వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 70 మందికి పైగా రోగులకు గుండె పరీక్షించారు. వీరిలో పది మందికి అదనపు పరీక్షల నిమిత్తం విజయవాడ హెల్ప్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ముందుగా ఈ వైద్యశిబిరాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పారుపల్లి నరసింహారావు, మచ్చ సూరయ్య, నవతకాని గోపీ, కొమ్మవరపు దిబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు

క్రోసూరు,ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): క్రోసూరు అచ్చంపేట మండలాల్లో సత్తెనపల్లి లీగల్ మెట్రాలజీ అధికారులు శనివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. క్రోసూరులో రేషన్ సరఫరా చేసే 12 వాహనాల్లో ఉన్న తూకాలకు స్టాంపింగ్ లేని కారణంగా కేసులు నమోదు చేసినట్టు తూనికలు, కొలతల శాఖ అధికారి జాన్ సైదా తెలియ జేశారు. హసానాబాద్‌లో రేషన్ దుకాణంలో తూకంలో వ్యత్యాసం ఉన్న కారణంగా కేసు నమోదు చేశామన్నారు. అచ్చంపేట మండలం తాళ్ళచెరువు, చింతపల్లి, వేల్పూరు గ్రామాల్లో, హసానాబాద్ గ్రామంలో పాలకేంద్రాల్లో కొలతల్లో వ్యత్యాసం ఉన్నందున కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. మిర్చి కాటాల్లో కూడా తేడాలు ఉండటంతో సంబంధితులపై కేసులు నమోదుచేసి జరిమానాలు విధించినట్టు తెలిపారు. తూకాల్లో తేడాలు ఉంటే సహించేది లేదని తెలిపారు. తూనికలు, కొలతలశాఖ అధికారులు తనిఖీలు చేపడుతున్నారన్న విషయం తెలియటంతో దుకాణదారులు షాపులను మూసివేశారు.



హసానాబాద్‌లో చౌక ధరల దుకాణంలో తూకాలు తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

ఎమ్మెల్యే చొరవతో రహదారి నిర్మాణం

- 25 ఏళ్ల నరకయాతనకు విముక్తి
- ఎమ్మెల్యే ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు



నాడు అధ్వానంగా.. నేడు నూతనంగా రహదారి

అమరావతి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) గత 25 సంవత్సరాలుగా మండల పరిధిలోని నెమలికల్లు, మండెపూడి గ్రామాల మధ్య సుమారు 2.5కిమీ రహదారి అధ్వానంగా మారి ఆ రెండు గ్రామాల ప్రజలకు, రైతులకు నరకయాతన కలిగించేది. అడుగడుకో గుంత ఏర్పడిన ఈ రహదారిలో వాహన దారులు వెళ్లాలంటే తీవ్రంగా ఇబ్బందులకు గురయ్యేవారు. వరదల సమయంలో రహదారికి కోతలు పడటంతో మార్జిన్‌లు ప్రమాదభరితంగా ఉండేవి. గతంలో ప్రభుత్వాలు మారినన ప్రతిసారి ఆ రహదారిలో గుంతలకు మట్టి వేసి కాలం వెల్లబుచ్చడం జరిగేది తప్ప పటిష్టమైన రహదారి నిర్మించిన పరిస్థితి లేదు. పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ అధికారం చేపట్టిన ఈ ఏడు నెలల్లోనే నియోజకవర్గంలో సుమారు రూ. 40 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వాటిలో ఉపాధి హామీ నిధులు రూ.2 కోట్లతో శిథిలమై నరకయాతన కల్గిస్తున్న నెమలికల్లు, మండెపూడి గ్రామాల మధ్య రహదారిని పూర్తి స్థాయిలో తారురోడ్డుగా నిర్మించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దీంతో ఆ రెండు గ్రామాల ప్రజల ప్రయాణ కష్టాలను తొలగించారు. ఇందుకుగాను ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ఆంజనేయ స్వామి హుండీలో నగదు చోరీ

క్రోసూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉయ్యందన నడిబొడ్డులో ఉన్న భారీ ఆంజనేయ స్వామి విగ్రహం హుండీలో చోరీ జరిగింది. విగ్రహం వద్ద ఉన్న హుండీని పగల గొట్టి దొంగలు నగదు దోచుకు వెళ్ళారు. సుమారు రూ 25వేలు వరకు నగదు హుండీలో ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి హుండీలో నగదు లెక్కించటం జరుగుతుందని, సుమారు నాలుగు నెలల నుంచి నగదు లెక్కించ లేదని గ్రామస్థులు తెలియ జేశారు. శనివారం ఉదయం హుండీ పగలగొట్టి ఉండటం, నగదు, చోరీకి గురికావటం గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ పత్తిపాటి సురేష్ సంఘటనా స్థలాన్ని సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. క్రోసూరులో వెంకటేశ్వర స్వామికి ఎదురు నడిచే మందిరం వద్ద శంకు చక్రాల దిమ్మెలు కూల్చివేసిన సంఘటన మరువకముందే ఉయ్యందనలో ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద హుండీ నగదు చోరీకి గురి కావటం ఆందోళన కలిగిస్తుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఎట్టకేలకు బారికేడ్లకు పసుపు రంగు

మాచర్లరూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాచర్ల - నాగార్జునసాగర్ జాతీయ రహదారి వెంబడి బారికేడ్లకు అధికారులు నిబంధనలమేరకు ఉండాల్సిన పసుపు రంగు వేశారు. అయితే అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలకు అది ఆగ్రహం తెప్పించింది. వారి ఆదేశాలతో అధికారులు అప్పటికే వేసిన పసుపు రంగును తొలగించి నలుపురంగు వేయడం వివాదాస్పదమైంది. ఇప్పుడు అధికారులు ఆయా బారికేడ్లకు బారికేట్లకు నలుపు పసుపు రంగు వేస్తున్నారు.



బారికేడ్లకు పసుపురంగు వేస్తున్న సిబ్బంది

నిర్మించారు.. ప్రారంభం మరిచారు

రెంటచింతల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని ఏడు మంగళం వాగు సమీపంలో నిర్మించిన ఆయుష్మాన్ భారత్ క్లినిక్ నిర్మించి నెలలు గడిచినప్పటికి నేటికి ప్రారంభించలేదు. దాదాపు ఏడాదిగా భవనాన్ని నిరుపయోగంగానే వదిలేశారు. ఈ భవనం నిర్మాణానికి ఉపాధి హామి పథకం నిధులు రూ.20.80 లక్షలు వెచ్చించారు. 2024 ఫిబ్రవరిలో నిర్మాణం పూర్తి చేసినప్పటికి అధికారులు ప్రారంభించడాన్ని విస్మరించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టిసారించి ఆయుష్మాన్ భారత్ క్లినిక్ భవనాన్ని ఉపయోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యానికి తన సంపూర్ణ మదతు వుంటుందని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శనివారం పిడుగురాళ్ల, మాచవరం మండలాల్లోని ప్రైవేటు పాఠశాలల డైరెక్టర్ల ఆత్మీయ సమావేశాన్ని పట్టణంలోని శుభమస్తు కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేందుకు ప్రైవేటు పాఠశాలలు కృషి చేయాలన్నారు. ఏ ప్రైవేటు పాఠశాల యాజమాన్యానికి ఏ ఇబ్బంది తలెత్తినా తన వద్దకు రావాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బందిలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలను కేటాయిస్తామన్నారు. ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆలపాటి రాజాకు పట్టభద్రులంతా ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం భారీ గజమాలతో ఎమ్మెల్యే యరపతినేనిని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సత్కరించారు. కార్యక్రమంలో యూపీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వి.సుదర్శన్, మూల్పూరి వెంకట్రామయ్య, పీజేఎన్ ధన్, జి శ్రీనివాస రెడ్డి, కోనేటి నరసింహారావు, బాలగంగాధర రెడ్డి, బాడిశ మస్తాన్‌రావు, ఎస్‌వి రామయ్య, వి.సతీష్‌రెడ్డి, జీకే పబ్లిక్ స్కూల్ శ్యామ్, నలగాలి నాగేశ్వరరావు, విజ్ఞాన్ సాంబశివరావు, రామకృష్ణ, పాల్గొన్నారు.

ఆలపాటి ఘన విజయం సాధించాలి

కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి మాజీ మంత్రి డాక్టర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించేలా అందరం కృషి చేద్దామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శని వారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కూటమినేతలతో నిర్వహించిన సమావే శంలో యరపతినేని మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నమోదైన అరున్నరవేలకు పైగా ఓట్లలో అధిక శాతం ఆలపాటి రాజేంద్రప్రసాద్ మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా చూడాలని సూచించారు. ప్రతి 30ఓటర్లకు ఒక ఇన్‌చార్జిను నియమించి, ప్రతిరోజు ఆ ఇన్‌చార్జి ఆ 30 మంది ఓటర్లను ఓటర్లను కలిసి కూటమి అభ్యర్థి విజయం ఆవశ్యకతను వివరించాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు సీఆర్ రాజన్, కళ్లం రాజశేఖరెడ్డి, యరపతినేని నిఖిల్, కూటమి నేతలు పలువురు పాల్గొన్నారు.

ఆలపాటి విజయం కోసం కృషి చేయాలి

- పార్టీ శ్రేణులతో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాదు విజయం కోసం పార్టీ శ్రేణులు సమష్టిగా కృషిచేయాలని ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో శనివారం టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికలపై మండల ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే ప్రవీణ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ మాజీ మంత్రి, సీనియర్ నేత అయిన రాజేంద్రప్రసాద్ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటారని, ఆయనను గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియోజక వర్గ పరిశీలకులు కేకే చౌదరి, జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీఏస్ వర ప్రసాదు, నాయి బ్రాహ్మణ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వడ్ల మూడి అప్పారావు, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మండల టీడీపీ నేతలు గంగినేని లీలావతి, షేక్ ముంతాజ్, మక్కెనసాగర్, ఏటుకూరి బ్రహ్మయ్య, నెల్లూరి మల్లికార్జునరావు, మోదుగుల చంద్రశేఖర్, ఏటుకూరి రత్నకుమార్, అజ్మల్లా, అప్పారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

గుండెకు గోల్డెన్ అవర్!

● ఏరియా వైద్యశాలలో ఉచితంగా టెనెట్+ ఇంజక్షన్‌లు

● అందుబాటులోకి స్టెమీ ప్రాజెక్టు

● గుండెపోటుతో ప్రాణం పోకూడదనేదే లక్ష్యం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వయస్సుతో సంబంధం లేకుండా యుక్త వయస్సులోనూ గుండెపోటుకు గురై చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూనే హృదయానికి రక్షణగా నిలిచేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. గుండెపోటుతో ఎవరూ మరణించకూడదనే లక్ష్యంతో స్టెమీ ఇంజక్షన్‌కు శ్రీకారం చుట్టింది. రక్తనాళం పూడిపోయిన సందర్భంగా వచ్చే తీవ్ర గుండె నొప్పిని స్టెమ్మి అంటారు. దీనికి రక్షణగా చికిత్స అవసరం. బాధితులను ఇతర ప్రాంతాలకు తరలించే క్రమంలో ప్రాణాలు కోల్పోయే అవకాశాలు ఎక్కువ. ఇలాంటి మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం ఏరియా వైద్యశాలలో స్టెమీ ప్రాజెక్టు పేరుతో గోల్డెన్ అవర్ చికిత్సను అందుబాటులోకి తెచ్చింది. ఎటువంటి గుండె నొప్పి వచ్చినా గంటలోపు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వస్తే బాధితుడికి రూ.45 వేలు విలువైన టెనెట్+ అనే ఇంజక్షన్‌ను ఉచితంగా ఇస్తున్నారు. ఇంజక్షన్ వేశాక బ్లాక్ అయిన రక్తనాళం తెరుచుకొని బాధితుడి ప్రాణాలను కాపాడుతుంది. తరువాత రెండు నుంచి మూడు గంటల సమయం లభిస్తుందనీ, దీంతో పెద్ద ఆస్పత్రికి వెళ్లి గుండె ఆపరేషన్ చేయించుకొని ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఇప్పటి వరకు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో 36 మందికి ఇంజక్షన్‌లు ఇచ్చారు. వీరిలో 34 మంది ప్రాణాలు కాపాడారు.

టెలీ మెడిసిన్ ద్వారా చికిత్స

ఛాతీ నొప్పి, శ్వాస సక్రమంగా ఆడకపోవటం, చెమటలు పట్టడం, వికారం, వాంతులు అవ్వటం వంటి లక్షణాలు గుండె నొప్పికి కారణాలుగా చెపుతారు. ఈ లక్షణాలతో ఆస్పత్రికి వచ్చిన రోగికి ఆక్సిజన్ పెట్టి ఈసీజీ తీస్తారు. దీనిని యాప్ ద్వారా జిల్లా ఆస్పత్రికి పంపుతారు. అక్కడ ఉన్న గుండె వ్యాధి నిపుణులు పరిశీలించి స్టెమీ ఐతే టెనెట్+ ఇంజనక్షన్ సిఫార్స్ చేస్తారు. లేదంటే ఈసీజీ రిపోర్టుకు తగ్గట్టుగా మందులు, ఇంజక్షన్‌లు వేయాలని సూచిస్తారు.



గుండెపోటు బాధితులకు ఇచ్చే ఇంజక్షన్

ఉచితంగా అందిస్తున్నాం



గుండెపోటుకు గురై ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే బాధితుల ప్రాణాలను కాపాడేందుకు రూ.45 వేలు విలువైన ఇంజక్షన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఇంజక్షన్ అందుబాటులో ఉంది.

- డాక్టర్ గిరిరాజు, ఎండీ జనరల్, సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

అవగాహన అవసరం



స్టెమీపై అవగాహన లేకపోవటంతో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. పూర్తి బ్లాకేజ్‌తో ఆస్పత్రికి వస్తున్నారు. వైద్యులు టెనెట్+ ఇంజక్షన్ చేయాలని చెపుతున్నా నిరాకరిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి తిరిగి ఇదే ఇంజక్షన్‌ను రూ.45 వేలు ఇచ్చి చేయించుకుంటున్నారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఇంజక్షన్‌ను ఉచితంగా అందిస్తున్నాం.

- డాక్టర్ లక్ష్మణరావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, సత్తెనపల్లి


ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి)

వాసవీ పీఠాధిపతి.. తెనాలివాసే

● శనివారం పెనుగొండలో పట్టాభిషేకం

● బాధ్యతలు స్వీకరించిన ప్రజ్ఞానంద సరస్వతి

● రెండో పీఠాధిపతిగా అరుదైన గౌరవం


అఖిల భారత శ్రీ వాసవీమాత పెనుగొండ క్షేత్రం

తెనాలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత శ్రీ వాసవీమాత పెనుగొండ క్షేత్రానికి పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రజ్ఞానంద సరస్వతి(బాలస్వామి) తెనాలి వాసే. దేశవ్యాప్తంగా ఆర్యవైశ్యులకు ఆరాధ్య దైవమైన వాసవీ మాత పీఠం పెనుగొండలో ఉంది. దీనికి తెలుగు రాష్ట్రాలే కాకుండా, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, మరికొన్ని ఉత్తర, దక్షిణ భారత రాష్ట్రాల నుంచి ప్రతినిధులున్నారు. ప్రముఖ సంస్థల ప్రతినిధులు ఈ ట్రస్టుకు సారథ్యం వహిస్తుంటే, దీనికి తెనాలికి చెందిన బాలస్వామిని ఎంపిక చేయటం, శనివారం పట్టాభిషేకం చేయటంతో తెనాలిలో పండుగ వాతావరణం నెలకొంది. వాసవీ పీఠానికి తొలి అధిపతిగా శ్రీ కృష్ణానందపురి స్వామీజీ 16 ఏళ్లపాటు ఉన్నారు. గతేడాది ఆయన శివైక్యం చెందటంతో ఆయన స్థానంలో పీఠాధిపతి బాధ్యతలను అప్పగించేందుకు అప్పటి నుంచి అన్వేషణ జరుగుతూనే వచ్చింది. అయితే తెనాలికి చెందిన బాలస్వామిని ఎట్టకేలకు ఎంపికచేశారు. దీంతో తెనాలికి అరుదైన గౌరవం దక్కటంతో అందరిలోనూ సంతోషం వ్యక్తమవుతోంది. తెనాలి పట్టణానికి చెందిన బొలిశెట్టి నరసింహారావు, రాజ్యలక్ష్మి దంపతులకు బాలస్వామి 1989లో జన్మించారు. ఈయన అసలు పేరు బొలిశెట్టి వెంకట ప్రదీప్ శ్రేష్టి. ఆయన విద్యాభ్యాసం స్థానిక తాలూకా ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు సాగింది. ఆ తర్వాత శ్రీవిద్యాపీఠంలో ఆధ్యాత్మిక జీవితం మొదలై, వేద పఠనం ప్రారంభించారు. ఆ తర్వాత నైమిశారణ్యంలో శ్రీ ఆనందానంద సరస్వతి స్వామీజీ సన్నిధిలో సన్యాసదీక్ష తీసుకున్నారు. అప్పటి నుంచి ఆధ్యాత్మిక చింతనతోనే అడుగులు వేస్తూ వచ్చారు. చాలాకాలంగా ఆలయాల్లో ఆధ్యాత్మిక బోధ, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. శ్రీ విద్యాపీఠం, శ్రీ సాలగ్రామ మఠం వంటివాటి ద్వారా అద్వైత, ఉపనిషత్తుల సారాన్ని వివరిస్తూ వాసవీ మాత అనుగ్రహం పొందిన వారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇవన్నీ ఆయనను వాసవీ పీఠానికి అధిపతిని చేశాయి. తెనాలి-బుర్రిపాలెం రోడ్డులో సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని కూడా నిర్మించే పని మొదలు పెట్టారు. ఇంతలోనే ఆయనను పీఠాధిపతిగా నియమించటంతో తెనాలికి మంచి గుర్తింపు వచ్చినట్టయింది. ఆయన పట్టాభిషేకానికి తెనాలి నుంచి ఆర్యవైశ్య ప్రముఖులు, వాసవీ మాత భక్తులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.


మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఆలపాటి.. ధూళిపాళ్ళ మధ్య సయోధ్య?

● నరేంద్రకు ఫోన్‌చేసి మద్దతు కోరిన ఎమ్మెల్సీ అభ్యర్థి రాజా

● రెండు, మూడు రోజుల్లో ఇద్దరి సమక్షంలో పొన్నూరులో సమావేశం


ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తన చిరకాల ప్రత్యర్థి అయిన పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌తో సయోధ్య కుదుర్చుకున్నట్లు సమాచారం. వీరిద్దరూ ఒకే పార్టీలో ఉన్నప్పటికీ ఇద్దరి మధ్య ఆధిపత్య పోరాటం ఉంది. రాజా నేతృత్వంలోని ఓ వర్గం సంగం డెయిరీపై ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశారనే గుర్రుతో నరేంద్ర రాజాకు దూరంగా ఉంటూ వచ్చారు. దీంతో ఇద్దరూ పార్టీకి వీరవిధేయులుగా ఉన్నప్పటికీ స్వపక్షంలో విపక్షీయులుగానే వ్యవహరిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో తెనాలి సీటు జనసేనకు కేటాయించటంతో ఇన్‌చార్జిగా ఉన్న రాజా సీటును త్యాగం చేయాల్సి వచ్చింది. సీటు దక్కనప్పటికీ తెనాలిలో జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ గెలుపు కోసం పట్టుదలతో పనిచేసి పార్టీ సుప్రీం చంద్రబాబు మెప్పు పొందారు. దీంతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం పార్టీ తరపున రాజాకు చంద్రబాబు కల్పించారు. ఆయన ఇప్పటికే గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల పరిధిలోని 33 నియోజకవర్గాల్లో ఒక్క పొన్నూరు మినహా అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే నరేంద్ర గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకపోవడం వల్లే ఆలపాటి ఆ నియోజకవర్గంలో అడుగు పెట్టలేదు. రెండు రోజుల క్రితం కృష్ణా జిల్లాకు చెందిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఇదే అంశంపై నరేంద్రతో మాట్లాడేందుకు పొన్నూరు వెళ్లగా ఆయన స్థానికంగా లేరు. ఈ పరిస్థితుల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా నరేంద్రకు రాజానే రెండు రోజుల క్రితం ఫోన్ చేసి మద్దతు కోరినట్లు తెలిసింది. అంతేకాకుండా శుక్రవారం జరిగిన తన నామినేషన్ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారని సమాచారం. కుంభమేళాలో ఉన్న తాను కార్యక్రమానికి హాజరు కాలేనని రాజాకు నరేంద్ర చెప్పినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో పొన్నూరు వచ్చాక కార్యకర్తలతో చర్చించి ఆలపాటి గెలుపు కోసం సమావేశం ఏర్పాటు చేసేందుకు నరేంద్ర సన్నద్ధమవుతున్నట్టు తెలిసింది. పార్టీకి వీర విధేయుడుగా ఉండే ధూళిపాళ్ల ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు వ్యక్తిగత ద్వేషాలను పక్కన పెట్టాలనే నిర్ణయానికి రావడంతో ఆలపాటి వర్గీయులు కూడా సంతోషంలో ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పుణ్యమా అని ఒకే వేదికపై కలిసి ఆలపాటి, ధూళిపాళ్ల ప్రసంగించనున్నారు.


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు..

సంకల్ప బలంతోపాటు నిజాయితీ ఉండాలి

● సినీ దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ)

● విజ్ఞాన్‌లో వైభవంగా ముగిసిన మహోత్సవ్


మాట్లాడుతున్న సినీ దర్శకుడు కేఎస్ రవీంద్ర(బాబీ)

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): యువత తమ కలలను సాకారం చేసుకోవడానికి సంకల్ప బలంతో పాటు నిజాయితీ ఉండాలని సినీ దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ) అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించిన విజ్ఞాన్ మహోత్సవ్ శనివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన కెఎస్ రవీంద్ర (బాబీ) మాట్లాడుతూ జీవితంలో ముందుకు వెళ్లాలంటే అల్లరితో పాటు క్రమశిక్షణ ఉండాలన్నారు. ఇష్టమైన రంగంలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. యువత సంకల్పంలో నిజాయితీ ఉంటే అనుకున్నది తప్పకుండా జరుగుతుందన్నారు. జీవితంలో మొదటగా మిమ్మల్ని మీరు నిరూపించుకోవాలని 2024 పారాఒలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్, ఇండియన్ పారా పిస్టల్ షూటర్, అర్జున అవార్డీ రుబినా ఫ్రాన్సిస్ అన్నారు. విజ్ఞాన్స్ మహోత్సవ్ ద్వారా విద్యార్థులకు నూతన అనుభవం పొందే అవకాశం లభించిందని వర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి అన్నారు. నాయకత్వ లక్షణాలు, టీమ్ వర్క్ నేర్చుకోవడం, వివిధ కళా, సాంకేతిక రంగాలలో మెరుగుదల, దేశవ్యాప్తంగా ఉన్న ఇతర కళాశాల విద్యార్థులతో ఇంటరాక్షన్ పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా క్రీడా, సాంస్కృతిక కళారంగాల్లో విజేతలకు బహుతులు అందజేశారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న బాబీ, పారా షూటర్, అర్జున అవార్డు గ్రహీత రుబినా ఫ్రాన్సిస్

ఆచరణాత్మక కృషితో అద్భుత విజయాలు

● డాక్టర్ కొంగర రవికాంత్

● భాష్యం బ్లూమ్స్‌లో ముగిసిన సాంస్కృతిక కళా ఉత్సవాలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆలోచనలకు ఆచరణాత్మక కృషి తోడైతే జీవితంలో అద్భుత విజయాలు సాధిస్తారని ప్రముఖ వైద్యులు, గ్యాస్ట్రో అండ్ బెరియాట్రిక్ సర్జన్ డాక్టర్ కొంగర రవికాంత్ అన్నారు. భాష్యం బ్లూమ్స్ వీబీసీ క్యాంపస్‌లో హరాప్లా పేరుతో నిర్వహిస్తున్న సాంస్కృతిక వేడుకలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ కొంగర రవికాంత్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ప్రభావం విద్యార్థులపై తీవ్రంగా ఉందని, ఈ నేపథ్యంలో ఏది మంచి, ఏది చెడు అన్న విచక్షణతో విద్యార్థులు మెలిగేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. భాష్యం బ్లూమ్స్ పూర్వ విద్యార్థి డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ చదువు నేర్పిన గురువుల్ని, తల్లిదండ్రుల్ని గౌరవించాలని సూచించారు. భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు ప్రసంగిస్తూ విద్యార్థుల ఉన్నతికి భాష్యం సంస్థలు కృషి చేస్తున్నాయని అన్నారు. సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ మాట్లాడుతూ తమ సంస్థల్లో చదువుతోపాటు క్రీడా, సాంస్కృతిక, కళారంగాలకు పెద్దపీట వేసి విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికితీస్తామన్నారు. భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు, ప్రిన్సిపాల్స్ కవిత, గిరిజారాణి, జడ్పీ ఈవో వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కొంగర రవికాంత్


విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

కేవలం సంక్షేమాన్ని నమ్మినందుకే ఢిల్లీలోనూ ఏపీ ఫలితాలు

● లోక్‌సభలో టీడీపీ నేత ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు

గుంటూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని వదిలేసి కేవలం సంక్షేమాన్ని నమ్ముకుంటే ఆంధ్రప్రదేశ్‌లో గత ఎన్నికల్లో ఏం జరిగిందో ఢిల్లీలోనూ అదే జరిగిందని లోక్‌సభలో టీడీపీ నేత ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు తెలిపారు. గుంటూరులో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో ప్రచారానికి వెళ్ళిన సమయంలో తాను అక్కడ నీటి సమస్యను స్వయంగా చూశానన్నారు. రైల్వే బడ్జెట్‌లోనూ గతంలో కంటే పది రెట్లు అదనంగా ఏపీకి దక్కాయన్నారు. రాష్ట్రంలో అన్ని అనుమతులు పొందిన ఏకైక ప్రాజెక్టు వరికపూడిశెల అన్నారు. రైతు భరోసా 2018 వరకు కటాఫ్ అని ఇప్పటికే ప్రకటించారని దీనిపై తాను లోక్‌సభలో కూడా మాట్లాడినట్లు ఎంపీ చెప్పారు.

పెంచకపోగా.. కుదింపా?

(5వ పేజీ తరువాయి)

రైళ్లు, సండ్రీస్ ద్వారా వచ్చే ఆదాయం పైనే ఆధారపడక తప్పని పరిస్థితి నెలకొంటున్నది. గుంటూరు రైల్వే డివిజన్‌కి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నెలాఖరు వరకు రూ.466.21కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో ప్రయాణికుల టిక్కెట్ చార్జీల రూపంలో రూ.171.55కోట్లు వస్తే 2.77 మెట్రిక్‌టన్నుల సరుకు రవాణాకు రూ.299 కోట్ల ఆదాయం వచ్చింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే 64.1 శాతం ఆదాయం సరుకు రవాణా ద్వారానే గుంటూరు రైల్వే డివిజన్‌కు వచ్చింది. జొన్న, డెక్కన్ సిమెంట్స్ నుంచి క్లింకర్, సిమెంట్ లోడింగ్ నిలిచిపోయినా ఈ ఆదాయాన్ని ఆర్జించింది. సండ్రీస్ రూపంలో రూ.16.87 కోట్లు వచ్చింది.

తెలంగాణ పరిధిలోనే లోడింగ్ స్టేషన్లు..

ఇప్పటి వరకు గుంటూరు డివిజన్ పరిధిలో మేజర్ లోడింగ్ స్టేషన్లుగా చిట్యాల, నల్గొండ, మిర్యాలగూడ, విష్ణుపురం, నడికుడి ఉన్నాయి. పొందుగుల, రెడ్డిపాలెం గూడ్స్ షెడ్లు, నరసరావుపేట, నంద్యాల, జాన్‌పహాడడ్, నల్లపాడు(ఆర్ఎం సీ), శావల్యాపురం(ఆర్ఎం సీ), వినుకొండ, దొనకొండలోనూ ఫుల్ రేక్ లోడింగ్‌కు అవకాశం ఉన్నది. అయితే వీటిలో సరుకు దిగుమతి తప్ప బయటకు వెళ్లేది చాలా తక్కువ. ఇవికాక విష్ణుపురంలో ఇండియా సిమెంట్స్ సైడింగ్, జాన్‌పహాడ్‌లో పెన్నా సిమెంట్స్ సైడింగ్, డెక్కన్ సిమెంట్ సైడింగ్‌లున్నాయి. నల్గొండ, మిర్యాలగూడలో ఎఫ్‌సీ, మిర్యాలగూడలో మ్యాట్రిక్స్ వేర్‌హౌసింగ్ సైడింగ్స్ ఉన్నాయి. ప్రైవేటు ఫ్రైట్ టెర్మినల్ కూడా ఒకటి ఉన్నది. కంటైనర్ రైల్ టెర్మినల్ గుంటూరులో ఉన్నది. వీటిని పరిగణనలోకి తీసుకుంటే సరుకు రవాణా జరిగే ప్రదేశాలన్నీ తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నాయి. కొత్తగా విష్ణుపురం వద్ద యాదాద్రి థర్మల్‌పవర్ ప్లాంట్‌కు బొగ్గు దిగుమతి అధికంగా జరుగుతోంది. ఇప్పుడు సరుకు రవాణా వచ్చే సెక్షన్ మొత్తాన్ని దక్షిణమధ్య రైల్వేలోనే కొనసాగిస్తూ సికింద్రాబాద్ డివిజన్‌లో చేర్చడానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఇదే జరిగితే ఇక గుంటూరు డివిజన్‌కు మిగిలేది నడికుడిలో చెట్టినాడ్ సిమెంట్స్ క్లింకర్ లోడింగ్ మాత్రమే. దానివల్ల ప్రస్తుతం కోల్పోబోతోన్న ఆదాయంలో 10శాతం కూడా భర్తీకాదు. ఇక ప్రత్యామ్నాయంగా నడికుడి-శ్రీకాళహస్తి నూతన రైలుమార్గం ద్వారా సరుకు రవాణాని పెంచుకోవాలి. అది జరగాలంటే ఈ రైలు మార్గం పూర్తికావాలి. ప్రస్తుతం భూసేకరణ సమస్యని ఈ రైలుమార్గం ఎదుర్కొంటోంది. ఒకవేళ ఇది పూర్తైతే నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టుకు కనెక్టివిటి వస్తుంది. అప్పుడు ఆదాయం పెరగడానికి అవకాశం ఉంటుంది. అలానే మిర్చిరవాణా విషయంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలి. అప్పుడే లోటుభర్తీ జరిగి డివిజన్‌కి పూర్వవైభవం వస్తుంది.

నాలుగో తరగతి ఉద్యోగులపై చులకన భావన విడనాడాలి

● రాష్ట్ర సంఘ అధ్యక్షుడు రత్నకుమార్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నాలుగో తరగతి ఉద్యోగుల పట్ల మండల స్థాయిలో అధికారులు, సిబ్బంది చూపిస్తున్న చులకనభావన విడనాడాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర సంఘ అధ్యక్షుడు జి.రత్నకుమార్, జనరల్ సెక్రెటరీ ఎన్ రాజేష్‌ప్రభుకుమార్ పేర్కొన్నారు. శనివారం గుంటూరు జిల్లా పరిషత్ కాంపౌండ్‌లోని పీఆర్ క్లాస్ ఫోర్ యూనియన్ భవనంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో వారు ప్రసంగించారు. నాలుగో తరగతి ఉద్యోగుల సీనియారిటీ జాబితా తయారుచేయమని జిల్లా పరిషత్ అధికారులను ఎన్నిసార్లు అడిగినా ప్రయోజనం ఉండటం లేదన్నారు. యూనిఫామ్ అలవెన్స్ కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కో-ఆప్టెడ్ మెంబర్ ఎస్.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు లక్ష్మయ్య, గుంటూరు జిల్లా వైస్ ప్రెసిడెంట్ బి.ఆర్.అంబేద్కర్, ట్రెజరర్ షేక్ పెదబాబు సుభాని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్ క్లాస్ ఫోర్ యూనియన్ రాష్ట్ర నేతలు

వ్యాసభగవానుడు అందించిన మహత్తర కావ్యం భారతం

● పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు

● ప్రారంభమైన ప్రవచనాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తాను పొందిన అనుభూతిని లోకానికి అందించాలని సత్‌సంకల్పంతో మహాభారత కావ్యాన్ని వ్యాసభగవానుడు రచించారని మహా సహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహారావు అన్నారు. స్థానిక పట్టాభిపురం శ్రీ రమాసత్యనారాయణ స్వామి దేవాలయ ప్రాంగణంలో శనివారం మహాభారత యుద్ధంలో భగవంతుని పాత్ర అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు ప్రవచనం చేస్తూ వ్యాసభగవానుడి జీవితం మనకు ఆదర్శమన్నారు. భారతంపై ప్రవచనం చేసే ముందు వ్యాసభగవానుని అనుమతి పొందటం క్షేమకరమన్నారు. ఏ పురాణాలు ఉన్నా వాని లోని సారాంశాన్ని జీవితానికి అన్వయించుకోవడం ఉత్తమమన్నారు. కష్టాలుపడ్డవారికి సుఖాలు ప్రాప్తిస్తాయని చెప్పిన మహత్తర కావ్యం భారతమేనన్నారు. మహాభారత యుద్ధం సభాపర్వంలోనే ప్రారంభమైందని తెలిపారు. ఓర్పు, సహనం ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని, భారత యుద్ధంలో గెలవడానికి పాండవులు 14 ఏళ్లు వేచి ఉన్నారని అన్నారు. దుఃఖాన్ని ఇతరుల వద్ద పంచుకోవద్దని సూచించారు. మాయలో పడకుండా భారతం నేర్పుతుందని అన్నారు. శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం మన ఆధ్యాత్మిక సమానత్వమన్నారు. అన్ని కులాలు సమానమేనని లోకానికి తెలిపేది సత్యనారాయణస్వామి కథేనన్నారు. కార్యక్రమాన్ని ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఆది, సోమవారాల్లో కూడా ప్రవచనాలు జరుగుతాయని తెలిపారు.


ప్రవచనం చేస్తున్న డాక్టర్ గరికిపాటి నరసింహారావు, హాజరైన భక్తులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన

వినుకొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ హైస్కూల్ నందు జస్టిస్ ఆర్ట్స్ అకాడమి డైరెక్టర్ ఒంగోలు బ్యూలా ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 200మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనపరిచారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రముఖ న్యాయవాది పీజె లూకా మాట్లాడుతూ వజ్రగిరి జెస్టీస్ గీసిన చిత్రాలు నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం సంతరించుకున్నాయని, దేశ నలుమూలల జరుగుతున్న చిత్రలేఖనం పోటీల్లో వజ్రగిరి జెస్టీస్ గీసిన చిత్రాలకు జాతీయ అంతర్జాతీయ అవార్డులు సాధించడం వినుకొండకే గర్వకారణమని, వజ్రగిరి జెస్టీస్‌ను ఆదర్శంగా తీసుకొని చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు నైపుణ్యత సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ నెల 19వ తేదిన చిత్రకళాపండుగ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు చేతులమీదుగా బహుమతులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగోతు అనిల్‌కుమార్, కవి కమలరాం, కేశవ సూరిమాస్టారు, పఠాన్ ఖాశీం, పిరమిడ్ రాజు, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

● 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఓపెన్ చిత్రకళా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు 9848469694ను సంప్రదించాలన్నారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శనివారం పిడుగురాళ్ల, మాచవరం మండలాల్లోని ప్రైవేటు పాఠశాలల డైరెక్టర్ల ఆత్మీయ సమావేశాన్ని పట్టణంలోని శుభమస్తు కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేందుకు ప్రైవేటు పాఠశాలలు కృషి చేయాలన్నారు. ఏ ప్రైవేటు పాఠశాల యాజమాన్యానికి ఏ ఇబ్బంది తలెత్తినా తన వద్దకు రావాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న సిబ్బందిలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలను కేటాయిస్తామన్నారు. ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆలపాటి రాజాకు పట్టభద్రులంతా ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం భారీ గజమాలతో ఎమ్మెల్యే యరపతినేనిని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సత్కరించారు. కార్యక్రమంలో యూపీఎస్టీ రాష్ట్ర అధ్యక్షుడు వి.సుదర్శన్, మూల్పూరి వెంకట్రామయ్య, పీజేఎస్ ధన్, జి శ్రీనివాసరెడ్డి, కోనేటి నరసింహారావు, బాల గంగాధర రెడ్డి, బాడిశ మస్తాన్‌రావు, ఎన్‌వి రామయ్య, వి.సతీష్‌రెడ్డి, జీకే పబ్లిక్ స్కూల్ శ్యామ్, నలగాలి నాగేశ్వరరావు, విజ్ఞాన్ సాంబశివరావు, రామకృష్ణ, పాల్గొన్నారు.

ఆలపాటి విజయం కోసం కృషి చేయాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాదు విజయం కోసం పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో శనివారం టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికలపై మండల ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే ప్రవీణ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ మాజీ మంత్రి, సీనియర్ నేత అయిన రాజేంద్రప్రసాద్ ప్రజాసమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటారని, ఆయనను గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ పరిశీలకులు కేకే చౌదరి, జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ వర ప్రసాదు, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్ల మూడి అప్పారావు, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మండల టీడీపీ నేతలు గంగినేని లీలావతి, షేక్ ముంతాజ్, మక్కెనసాగర్, ఏటుకూరి బ్రహ్మయ్య, నెల్లూరి మల్లికార్జునరావు, మోదుగుల చంద్రశేఖర్, ఏటుకూరి రత్నకుమార్, అజ్మల్లా, అప్పారావు పాల్గొన్నారు.

కాలినడకన పెనుగంచిప్రోలుకు..

దాచేపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : 40 రోజుల మాలాధారణ పూర్తి చేసుకున్న లక్ష్మీ తిరుపమ్మ గోపయ్య స్వాములు పెనుగంచిప్రోలులోని లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానానికి చేరుకొనేందుకు శనివారం దాచేపల్లి మండలం తక్కెళ్ళపాడు నుంచి బయలు దేరారు. సుమారు 50 మంది స్వాములు, గురు స్వాములు జంగిలి అప్పారావు, కిష్టంశెట్టి ఫకీరయ్య ఆధ్వర్యంలో దాచేపల్లి నుంచి తంగెడ, హుజూర్‌నగర్, కోదాడ మీదుగా అమ్మవారి దేవస్థానానికి చేరుకుంటారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సుభాని

చిలకలూరిపేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో మూడు రోజుల పాటు జరిగిన శనివారం ముగిసిన అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర మహాసభల్లో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పట్టణానికి చెందిన సీపీఐ నేత సుభాని ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనను అభినందించారు.

చెత్తసేకరణ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

● ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని తీరు
● పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలతో కేంద్రాలను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీలు
● నిలిచిపోయిన వాటిని పునరుద్ధరించేందుకు సన్నాహాలు ప్రారంభం

శావల్యాపురం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన చెత్తసేకరణ కేంద్రాలు ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. దీనిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో చెత్తసేకరణ కేంద్రాలకు మహర్దశ కలుగనుంది. ఇటీవల పంచాయతీరాజ్ కమిషనర్ పంచాయతీ విస్తరణాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి చెత్తసేకరణ కేంద్రాలపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు అడ్డుకట్ట వేయాలని, అన్ని గ్రామాల్లోని చెత్తసేకరణ కేంద్రాలను పరిశీలించి అక్కడి పరిస్థితులు, అవి నిలిచిపోవడానికి గల కారణాలు తెలియజేసే నివేదికలు పంపాలని ఆదేశాలు జారీ చేశారు. దాంతో ఈవోపీఆర్డీలు రోజుకు రెండు చెత్తసేకరణ కేంద్రాలను పరిశీలించి అక్కడి పరిస్థితులపై నివేదికలు తయారు చేస్తున్నారు. ఫిబ్రవరి 15వ తేదీకల్లా అన్ని గ్రామాల్లో చెత్తసేకరణ కేంద్రాలను పునరుద్ధరించి వాడుకలోకి తేవాలని, ఇంటింటికీ చెత్తసేకరణ సజావుగా జరగాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.



వేల్పూరులో చెత్తసేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం మండలంలో 15 గ్రామపంచాయతీలు ఉండగా 13 గ్రామపంచాయతీల్లో చెత్తసేకరణ కేంద్రాలున్నాయి. ముండ్రువారిపాలెంలో చెత్తసేకరణ కేంద్రం నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. కేవలం బేస్‌మట్టం దశలోనే నిలిచిపోయింది. వయ్యకల్లులో చెత్తసేకరణ కేంద్రాన్ని ఎస్సీ కాలనీకి ఆనుకొని కట్టడంతో ఎస్సీ కాలనీవాసులు దానిపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో నిర్వహణ నిలిచిపోయింది. చెత్తసేకరణ కేంద్రం నుంచి వచ్చే దుర్వాసనతో ఎస్సీ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులు అందడంతో అధికారులు నిర్వహణ నిలిపేశారు. పిచికలపాలెంలో చెత్తసేకరణ కేంద్రానికి వెళ్లాలంటే వాగు అడ్డుగా ఉండడంతో చెత్తను చేరవేయడం ఇబ్బందికరంగా మారింది. కారుమంచిలో గతంలో ఎన్నో గ్రామాలకు ఆదర్శంగా చెత్తసేకరణ కేంద్రం నిర్వహణ జరిగేది. ఆదర్శగ్రామంగా గతంలో కారుమంచికి అవార్డులు కూడా వచ్చాయి. కానీ గత మూడునెలలుగా పారిశుధ్యం గాడితప్పింది. వేల్పూరులో కూడా చెత్తసేకరణ కేంద్రం నిర్వహణ బాగుండేది. వర్మికంపోస్ట్ ఎరువుల తయారీ కూడా ప్రారంభించారు. కానీ ఇటీవల అది కూడా నిలిచిపోయింది. కొన్ని గ్రామాల్లో హరిత రాయబారులు ఇంటింటికీ చెత్తసేకరణ చేసినప్పటికీ సేకరించిన చెత్తను చెత్తసేకరణ కేంద్రాల వద్దకు తీసుకెళ్లకుండా గ్రామాలకు వెలుపల రోడ్ల పక్కన పడేయడంతో దుర్వాసనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తసేకరణ కేంద్రాల వద్ద మౌలిక వసతులు, పరిసరాలు, ఇంటింటికీ చెత్తసేకరణ, హరితరాయబారులు, షెడ్డు మిత్రల కొరత, చెత్తను చేరవేసేందుకు రిక్షాలు తదితర అంశాలను ఈవోపీఆర్డీలు పరిశీలిస్తున్నారు. గ్రామాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించి నిలిచిపోయిన చెత్తసేకరణ కేంద్రాలను పునరుద్ధరించేందుకు సన్నాహకాలను ప్రారంభించారు. పారిశుధ్యం మెరుగుపరచి గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేలా, చెత్తసేకరణ కేంద్రాల వద్ద వర్మికంపోస్ట్ ఎరువుల తయారీని ప్రారంభించి పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని చేకూర్చేందుకు కృషి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెత్తపన్నును కూడా రద్దు చేసి ప్రజలపై పన్నుల భారాన్ని తగ్గించారు.



పొట్లూరులో చెత్తసేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ సుగుణ



మతుకుమల్లిలో చెత్తసేకరణ కేంద్రం వద్ద జేసీబీతో పిచ్చిచెట్లు తొలగిస్తున్న దృశ్యం

మా జోలికొస్తే ఊరుకోం

● మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుపై మాజీ మంత్రి విడదల రజిని శనివారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రజనీపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు నమోదైన నేపథ్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమ జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో ఆటవిక, అరాచకపాలన కొనసాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుల్లారావు దృష్టి అంతా అక్రమ కేసులు, అక్రమ సంపాదనపైనే ఉందనీ, ఇందులో కనీసం పది శాతమైన ప్రజల సమస్యలపై పెడితే నియోజకవర్గం బాగుపడుతుందని చెప్పారు. 'ఐదున్నరేళ్ల కిందట ఏదో జరిగిందట, టీడీపీ సాధారణ కార్యకర్త సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టాడట, దానిపై కేసు నమోదైందట, ఇందులో నా ప్రమేయం ఏం ఉంటుంది. దీనికి, నాకు ఏం సంబంధం, ఇదొక కట్టుకథ' అని అన్నారు. పోలీసుల ను కేవలం ఈ కేసు వివరాలు మాత్రమే హైకోర్టు కోరిం దనీ, ఫిబ్రవరి రెండో వారానికి కేసును వాయిదా వేసిం దని తెలిపారు. కరెంటు చార్జీల పెరుగుదలపై రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నిరసనలు జరిగాయని, అయితే ఒక్క చిలకలూరిపేటలో మాత్రం ఈ నిరసనలపై తనతో పాటు 30మంది వైసీపీ వారిపై కేసు లు పెట్టారని అన్నారు. నాపైనే కాకుండా 80 ఏళ్లకుపైగా వయసున్న మా మామగారిపై కూడా అక్రమ కేసులు పెట్టారనీ, నా మరిది పారిన్ సిటిజన్, ఆయన అక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నారు, అలాంటి వ్యక్తిపై కూడా ఎమ్మెల్యే పుల్లారావు ఇక్కడ అక్రమ కేసులు పెట్టించారని వివరించారు. ఇక్కడ ఐదేళ్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేశాను, ఇలాంటి అరాచకపాలనకు ఎప్పుడూ పాల్పడలేదు. ఎవరిపైనా తప్పుడు కేసులు నమోదు చేయలేదు. 2014- 19 మధ్య పుల్లారావు చేసిన అక్రమాలు, స్కామ్‌లపై మేం అధికారంలో ఉండగా ఒక్కసారి ఆలోచించి ఉంటే ఆయన ఏమైపోయి ఉండేవారని ప్రశ్నించారు. పుల్లారావు ఎక్కడ ఉన్నా, ఏ ఊర్లో ఉన్నా వడ్డీతో సహా చెల్లిస్తామనీ, నా ఏడేళ్ల రాజకీయ అనుభవం ముందు మీ 25 ఏళ్ల రాజకీయ అనుభవం తలదించుకుందన్నారు. మాది పురుషోత్తమపట్నం అనే సంగతి మర్చిపోవద్దు అన్నారు. అత్యుత్సాహంతో ముందుకు వెళ్లే కొందరు అధికారులను మరిచిపోం, భవిష్యత్తులో వారిపై తప్పకుండా చర్యలు ఉంటాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విడదల రజిని

మాజీమంత్రి రజినీపై టీడీపీ నాయకుల ఆగ్రహం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పదవిలో ఉండగా అన్ని రకాల అన్యాయాలు, అక్రమాలు చేసి ఇప్పుడు ప్రత్యర్థులపై నిందలు వేస్తూ మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడటంపై టీడీపీ స్థానిక సీనియర్ నాయకులు శనివారం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నేతలు మాట్లాడుతూ ప్రత్యర్థి పార్టీలకు చెందిన దళిత నేతలను నాడు అక్రమ కేసుల్లో ఇరికించి, వారి మీద పోలీసు అధికారి జరిపిన హింసాకాండను ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూస్తూ, పైశాచిక ఆనందాన్ని పొందిన రజిని నేడు సదరు దాష్టికాలపై బాధితులు కోర్టు ద్వారా తెచ్చిన ఆదేశాలను, పుల్లారావుపై ఆపాదించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. చిలకలూరిపేట టీడీపీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, జవ్వాజి మదన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పట్టణ పార్టీ కార్యదర్శి మద్దుమాల రవి మాట్లాడుతూ రజిని 80 ఏళ్ల మామ స్వగ్రామమైన పురుషోత్తమపట్నంలోని వేణుగోపాల స్వామి దేవస్థానం నిర్మాణ సమయంలో గుత్తేదారుపై జరిపిన దాడిని ప్రసార మాధ్యమాల ద్వారా అందరూ తిలకించారని, రజిని మరిది చిలకలూరిపేట గెజిట్ పేరిట పుల్లారావు కుటుంబసభ్యులపై, పార్టీ నేతలపై జర్మనీ నుంచి వేల సంఖ్యలో సోషల్ మీడియా పోస్టులు పెట్టి విషాన్ని చిమ్మిన సంగతి తెలియదా అని ప్రశ్నించారు. యడవల్లి దళితుల భూములు కాపాడతానని 2019లో పాదయాత్ర చేసి, ఆ భూములను అగ్ర వర్ణాల వారికి ఇప్పించి, మంత్రి పదవి కొట్టేసిన విషయం నియోజకవర్గంలో అందరికీ తెలుసునని అన్నారు. 16 నెలల నుంచి ఇక్కడి వైసీపీ కార్యకర్తలను వదలివేసిన రజిని, గతంలో దళితులపై జరిపిన దాడి కేసులో చర్యలు తీసుకోమని కోర్టు ఆదేశాలు ఇస్తే, నియోజక వర్గంలో ప్రతి గ్రామంలో కార్యకర్తలపై కేసులు పెట్టారని కలరింగ్ ఇవ్వడం ఎంతవరకు సబబు అని అన్నారు. ఒక్కసారి అవకాశం ఇస్తే ఎన్నికల్లో గెలిచి రెండోసారి అవకాశం లేక గుంటూరుకు వెళ్ళిన రజిని ఇక్కడే రాజకీయం చేస్తాననడం హాస్యాస్పదమని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిలకలూరిపేట టీడీపీ నాయకులు

రజిని వ్యాఖ్యలపై స్వగ్రామంలో విమర్శ

స్థానిక ఎమ్మెల్యే పుల్లారావు మీద విడదల రజిని చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆమె స్వగ్రామం పురుషోత్తమపట్నంకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు తోట సత్యం మీడియా సమావేశంలో శనివారం ఖండించారు. రజిని కుటుంబానికి రాజకీయ భిక్ష పెట్టిందే పుల్లారావు అని అన్నారు. పురుషోత్తపట్నం స్థానికురాలు అయితే నియోజకవర్గ వదిలేసి గుంటూరుకు వెళ్లి ఎందుకు పోటీ చేసినట్లు అని ప్రశ్నించారు.

పాఠశాల సమీపంలో అధ్వానంగా పారిశుధ్యం

● ఎరువుదిబ్బలు, మురుగునీటి కుంటలు
● దుర్వాసనతో విద్యార్థులు అవస్థలు

ఈపూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాల భవనాన్ని ఆనుకొని ఎరువుదిబ్బలు, మురుగునీటి కుంటలు ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని కొచ్చెర్ల బీసీ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆనుకొని ఎరువు దిబ్బలు వేశారు. కాలనీలో డ్రైనేజీ నీరంతా పాఠశాల ముందు చేరి మురుగునీటి కుంటగా దర్శనమిస్తుంది. అక్కడ నుంచి వచ్చే దుర్వాసనకి విద్యార్థులు అనారోగ్యం పాలౌతున్నారు. పాఠశాలలో ఐదు తరగతుల్లో సుమారు 70 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులే కాకుండా చుట్టు పక్కల నివశించే వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. గత ప్రభు త్వం హయాంలో అధికారులకు విన్నవించుకున్నప్పటికి ఉపయోగం లేకుండా పోయిందని కాలనీవా సులు అంటున్నారు. ఇప్పటికైన ఎరువుదిబ్బలు తొల గించి, మురుగునీటిని నిల్వలేకుండా చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుచున్నారు.



కొచ్చెర్ల బీసీ కాలనీలో పాఠశాల పక్కనే ఎరువు దిబ్బలు



పాఠశాలకు ఆనుకొని మురుగునీటి కుంట

చాలా ఇబ్బందిగా ఉంది

● నిశ్శంకరరావు అంకారావు, జనసేన నాయకుడు

పాఠశాల దగ్గర ఎరువు దిబ్బలు వేయడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బంది పడు తున్నారు. దిబ్బలు వల్ల రోడ్డుపై ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచలేక పోయింది. నిధులు మాత్రం ఖర్చు చేసినట్లు చెబుతున్నారు.

ఆలపాటిని అఖండ మెజార్టీతో గెలిపించాలి

● సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా

నకరికల్లు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభ్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదును అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపు నిచ్చారు. శనివారం నకరికల్లు టీడీపీ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నకరికల్లు మండల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ- అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే కూటమి ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ చేసి చూపించిందన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాదుకు సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి అత్యంత భారీ మెజార్టీ అందించే దిశగా అందరూ కలసి కట్టుగా పని చేయాలని కోరారు. ప్రతి రోజు నేతలకు కేటాయించిన 30 నుంచి 40 మంది ఓటర్లను కలసి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. మేధావులు, విద్యావంతులు కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను బలపరిచి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య, పరిశీలకులు తాతా జయప్రకాష్ నారాయణ, షేక్ ఆలీ బాషా, సాగి శ్రీను, పూజల వెంకట కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ విజయంపై బీజేపీ సంబరాలు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 70 సీట్లకు 48 సీట్లు సాధించి ఘనవిజయం సాధించిన సందర్భంగా పట్టణంలో శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచారు. స్థానిక నరసరావుపేట సెంటర్‌లో బీజేపీ విజయోత్సవ సభ నిర్వహించారు. పార్టీ జాతీయ నాయకుల సమష్టి కృషితో ఢిల్లీ విజయం సాధ్యమైందని సభలో నాయకులు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోట పవన్ కుమార్ గాంధీ, పరంకుశం శ్రీనివాసరావు, కస్తూరి వెంకటేశ్వర్లు, జయరామిరెడ్డి, శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో..

వినుకొండటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బీజేపీ విజయఢంకా మోగించిన సందర్భంగా పట్టణంలోని పార్టీ నాయకులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. శివయ్య స్థూపం సెంటర్లో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ మాట్లాడుతూ ఢిల్లీలో 27 సంవత్సరాల తర్వాత భారతీయ జనతాపార్టీ భారత ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అధికారం చేజిక్కించుకోవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో బొల్లాపల్లి మండల నాయకులు ఎలిశెట్టి నాగేశ్వరరావు, హనుమానాయక్, ఈపూరు మండల నాయకులు వడితే ప్రసాద్‌నాయక్, పట్టణ నాయకులు కాల్వ నరేష్, కిరణ్, గంగాదర్, మేడం అశోక్, సురభి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



లాయర్ స్ట్రీట్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద సంబరాల్లో పాల్గొన్న పార్టీ నాయకులు

నియోజకవర్గ కన్వీనర్ లెనిన్ ఆధ్వర్యంలో..

ఢిల్లీలో బీజేపీ అధికారం చేజిక్కించుకోవడంపై బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వినుకొండ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ లెనిన్ మాట్లాడుతూ ఆమ్‌ఆద్మీ పార్టీ, కాంగ్రెస్‌పార్టీ ఎన్ని రకాల కుతంత్రాలు చేసినప్పటికీ అనేక విధాలైన అబద్ధాలను ప్రచారం చేసినప్పటికి ఢిల్లీ ప్రజలు నిజమైన అభివృద్ధిని ఇచ్చే పార్టీగా బీజేపీని ఎన్నుకున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

శావల్యాపురంలో

శావల్యాపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీని మట్టి కరిపించి బీజేపీ అఖండ విజయాన్ని అందుకోవడం చరిత్రాత్మకమని బీజేపీ మండల అధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు అన్నారు. పోట్లూరు గ్రామంలోని పాత ఎస్సీకాలనీలో బీజేపీ విజయోత్సవ సంబరాలను బీజేపీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాటిబండ్ల ఆంజనేయప్రసాద్, తమ్మశెట్టి సిద్దయ్య, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు

క్రోసూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు అచ్చంపేట మండలాల్లో సత్తెనపల్లి లీగల్ మెట్రాలజీ అధికా రులు శనివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. క్రోసూరులో రేషన్ సరఫరా చేసే 12 వాహనాల్లో ఉన్న తూకాలకు స్టాంపింగ్ లేని కారణంగా కేసులు నమోదు చేసినట్టు తూనికలు, కొలతల శాఖ అధికారి జాన్ సైదా తెలియ జేశారు. హసానాబాద్‌లో రేషన్ దుకాణంలో తూకంలో వ్యత్యాసం ఉన్న కారణంగా కేసు నమోదు చేశామన్నారు. అచ్చంపేట మండలం తాళ్ళచెరువు, చింతపల్లి, వేల్పూరు గ్రామాల్లో, హసా నాబాద్ గ్రామంలో పాలకేంద్రాల్లో కొలతల్లో వ్యతాసం ఉన్నందున కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. మిర్చి కాటాల్లో కూడా తేడాలు ఉండటంతో సంబంధితులపై కేసులు నమోదుచేసి జరిమానాలు విధించి నట్టు తెలిపారు. తూకాల్లో తేడాలు ఉంటే సహించేది లేదని తెలిపారు. తూనికలు, కొలతలశాఖ అధికారులు తనిఖీలు చేపడుతున్నారన్న విషయం తెలియటంతో దుకాణదారులు షాపులను మూసివేశారు.

ఘనంగా నాగ మునీంద్ర స్వామి తిరునాళ్ల

బొల్లాపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరుపాడు గ్రామంలో శ్రీనాగమునీంద్ర స్వామి తిరునాళ్ళ శనివారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుడి వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో తిరునాళ్ళ సందర్భంగా రెండు భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి వాటిపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ఎస్ఐ ఏ బాలకృష్ణ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పేరూరుపాడు నాగమునీంద్ర స్వామికి ప్రత్యేక పూజల్లో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



పేరూరుపాడులో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు ప్రభ

వేంకటేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి పూజలు

వినుకొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న అలివేలుమంగ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా లక్ష తులసీ దళాలతో స్వామికి 108 మంది మహిళలు విష్ణు సహస్రనామ పూజా కార్యక్రమాలను శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

● టెన్నిస్‌పై మక్కువతో శిక్షణ పొందుతున్న చిన్నారులు



టెన్నిస్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచే పిల్లలకు క్రీడలపై ఆసక్తి పెంపొందేలా వారికి ఇష్టమైన ఆటలను నేర్పించి వాటిలో రాణించేలా చేస్తే వారికి మంచి భవిష్యత్తు ఉంటుంది. ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ముఖ్యం. క్రీడల్లో రాణిస్తే వారికి విద్య, ఉద్యోగాల్లో మంచి అవకాశాలు కూడా లభిస్తాయి. ఆటలు ఆరోగ్యంతో పాటు శారీరక మానసిక వికాసానికి తోడ్పడతాయి. ఆటలు ఆడే పిల్లలు చదువులోనే కాక జీవితంలో ఎదురయ్యే పలు సమస్యలను చాకచక్యంతో ఎదుర్కొనగలరని అనేక అధ్యయనాలు తెలుపుతున్నాయి.

చిలకలూరిపేట సీఆర్ క్లబ్ ఆవరణలో ఏడు నుంచి పది సంవత్సరాల వయస్సు కలిగిన వివిధ విద్యాసంస్థల విద్యార్థులు 12మంది టెన్నిస్ ఆట నేర్చుకుంటున్నారు. వీరంతా ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి వరకు చదువుకుంటున్న వారు. నరసరావుపేటకు చెందిన టెన్నిస్ కోచ్ ఈశ్వర్ ప్రతిరోజూ వారికి ఫ్లడ్ లైట్ల కాంతుల్లో గంట సేపు టెన్నిస్ ఆట నేర్పిస్తున్నారు. చిన్నారుల తల్లిదండ్రులు కూడా ఎంతో శ్రద్ధగా వారిని క్రీడా మైదానానికి తీసుకువచ్చి ప్రోత్సహిస్తున్నారు. వారిలోని క్రీడా స్ఫూర్తిని గమనించిన సీఆర్ క్లబ్ యాజమాన్యం క్రీడా మైదానాన్ని ఇచ్చి వారిని ప్రోత్సహిస్తోంది.